



Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 70 | గురువారం 07 ఆగస్టు 2025 | పేజీలు : 9 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



## ట్రంప్ మరో బాదుడు

**- తాజాగా 25శాతం అదనపు వడ్డన**
**- 50 శాతానికి చేరిన సుంకాలు**

**వాషింగ్టన్ - సూర్య వాస్తవం, ఆగస్టు 6**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెట్రేగిపోతున్నారు. 'ఆత్మీయ మిత్రుడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ' మౌన ఫలితమేమో కానీ ట్రంప్ మాత్రం సుంకాల మీద సుంకాలు బాదేస్తున్నారు. భారత్ ఎగుమతులపై మరో 25 శాతం అదనంగా సుంకాలు పెంచుతున్నట్లు ట్రంప్ బుధవారం

8లో



## అదానీపై అమెరికాలో దర్యాప్తు

**- అందుకే ట్రంప్ బెదిరింపులకు మోడీ సైలెంట్: రాహుల్**

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, ఆగస్టు 6**

పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీపై అమెరికా దర్యాప్తు కారణంగా డోనాల్డ్ ట్రంప్ నుంచి పదే పదే బెదిరింపులు వచ్చినప్పటికీ ప్రధాని మోడీ ఎదుర్కోలేకపోతున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు.

2లో

## 'లూలూ'కు చౌకగా భూమిపై ప్రభుత్వానికి నోటీసులు

**అమరావతి - సూర్య వాస్తవం, ఆగస్టు 6**



విశాఖపట్నం, విజయవాడలో 'లూ లూ'కు ప్రభుత్వం భూకేటాయింపు లను సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌ను హైకోర్టు బుధవారం విచారించింది. వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, లూలూ

2లో

### ఆ 65 లక్షల మంది

# ఓటర్ల వివరాలివ్వండి

**- ఈసీని ఆదేశించిన సుప్రీం**

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, ఆగస్టు 6**

బీహార్ ఓటర్ల ముసాయిదా జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల వివరాలను, తొలగించడానికి గల కారణాలను అందజేయాలని సుప్రీంకోర్టు బుధవారం ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. త్వరలో ఎన్నికలు జరగనున్న బీహార్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో చేపట్టిన ప్రక్రియలో భాగంగా ఆగస్టు 1న ముసాయిదా జాబితాను ఈసీ ప్రచురించింది. ఈ



వివరాలన్నింటినీ 9వ తేదీకల్లా అందజేయాలని జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని బెంచ్ ఈసీని ఆదేశించింది

- మిగతా 2లో..

# ఎస్ఐఆర్‌పై చర్చించాలి

**- పార్లమెంట్‌లో ప్రతిపక్షాల డిమాండ్**
**- 13వ రోజూ సమాధానమివ్వని కేంద్రం**

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, ఆగస్టు 6**

బీహార్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై చర్చించా లనే డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు చేపట్టిన ఆందోళన బుధవారానికి 13వ రోజుకు చేరుకున్నది. లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష



ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లారు. ప్లకార్డు పట్టుకుని నినాదాల హోరె త్తించారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. వెంటనే సభను స్పీకర్ ఓం బిర్లా మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో

- మిగతా 2లో..

### బీసీ రిజర్వేషన్లకు

# మోడీనే అడ్డంకి

**- 42శాతం రిజర్వేషన్లు సాధించేవరకు నిద్రపోం**
**- ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దీక్షలో సీఎం రేవంత్ రెడ్డి**
**- ప్రొఫెసర్ జయశంకర్, గద్దర్‌కు నివాళ్లు**

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, ఆగస్టు 6**

తెలంగాణలో బీసీ రిజర్వేషన్లకు ప్రధాని మోడీనే అడ్డంకి అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ విషయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలంగాణ బీసీ బిల్లులకు ఆమోదం తెలపకుండా అడ్డు పడుతున్నారని ఆరోపించారు. 'బిల్లులు



ఆమోదం తెలిపేందుకు రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ అడిగి చాలా రోజులైంది.. ఇప్పటి వరకు దీనిపై ఎలాంటి సమాధానం రాలేదు. ఇదీ శోచనీయం. రేపటిలోగా అపాయింట్‌మెంట్ ఇచ్చి, సమస్యను విని పరిష్కరిస్తా రని ఆశిస్తున్నాం. నరేంద్ర మోడీ తాజాగా రాష్ట్రపతిని కలిశారు. బీసీ బిల్లులపై అపాయింట్ మెంట్

- మిగతా 2లో..



## ఢిల్లీలో నూతన పరిపాలనా సౌధం..

**- 'కర్తవ్య భవన్'ను ప్రారంభించిన ప్రధాని మోదీ**
**- ఏటా అద్దెల రూపంలో చెల్లిస్తున్న రూ. 1,500 కోట్లు ఆదా అవుతుందని వెల్లడి**
**- ఒకేచోటకు ఏడు కీలక మంత్రిత్వ శాఖల తరలింపుతో సమన్వయం సులభతరం**
**- అత్యాధునిక భద్రత, పర్యావరణ హిత ఫీచర్లతో భవనం నిర్మాణం**

2లో

# స్మార్ట్ మీటర్ల కోసం అప్పులు

**- 15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం**
**- 99 పైసలకే ఐటీ కంపెనీలకు భూములు**
**- ఏపీఐఐసీ ద్వారా 30వేల ఎకరాల సేకరణ**
**- పర్యాటక హోటళ్లు ప్రైవేట్‌కు**
**- మరో గంట అదనంగా బార్లు**
**- మంత్రివర్గ నిర్ణయాలు**



**అమరావతి - సూర్య వాస్తవం, ఆగస్టు 6**

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై ప్రజానీకం నుండి వ్యక్తమవుతున్న తీవ్ర వ్యతిరేకతను రాష్ట్ర ప్రభుత్వం ఖాతరు చేయడం లేదు. ఒకవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతుండగానే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు దిశలో మరో కీలక నిర్ణయాన్ని తీసుకుంది. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు, వాటికి అవసరమైన లైన్లు ఏర్పాటుకోసం

- మిగతా 2లో..



## పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకుందాం

**- పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్**

8లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

### సీఐఐ భాగస్వామ్య సదస్సును

# విజయవంతం చేయాలి

**- మంత్రి నారా లోకేశ్**
**- ఈ ఏడాది నవంబర్ 14,15 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించనున్న సదస్సు**
**- మంత్రివర్గ ఉపసంఘం ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న మంత్రి నారా లోకేశ్**
**- అధికారులకు లోకేశ్ దిశానిర్దేశం**

**అమరావతి - సూర్య వాస్తవం, ఆగస్టు 6**

ఆంధ్రా ఈజ్ బ్యాక్' అనే విధంగా ఈ ఏడాది నవంబర్ 14,15 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించనున్న సీఐఐ(కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్) 30వ భాగస్వామ్య సదస్సు విజయవంతానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు-2025 ను సమన్వయం చేసేందుకు ఏర్పాటుచేసిన మంత్రివర్గ ఉపసంఘం ఆధ్వర్యంలో ఉండవల్లి




నివాసంలో తొలి సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు నిర్వహణ కోసం చేపట్టనున్న చర్యలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రివర్గ ఉపసంఘం ఛైర్మన్ మంత్రి నారా లోకేశ్ మాట్లాడారు.

- మిగతా 8లో..

# ఢిల్లీలో నూతన పరిపాలనా సౌధం..

(మొదటి పేజీ తరువాయి)

దేశ రాజధాని ఢిల్లీలో పరిపాలనా సంస్కరణలకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. చెల్లాచెదురుగా ఉన్న మంత్రిత్వ శాఖలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెస్తూ, సెంట్రల్ విస్టా పునరాభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన 'కర్తవ్య భవన్-03'ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కొత్త సమీకృత పరిపాలనా సముదాయం వల్ల ప్రభుత్వానికి ఏటా అద్దెల రూపంలో ఖర్చయ్యే రూ. 1,500 కోట్ల ప్రజాధనం ఆదా అవుతుందని స్పష్టం చేశారు.

**అద్దె భవనాలకు స్వస్తి.. పెరగనున్న సామర్థ్యం**

ప్రస్తుతం ఢిల్లీలో పలు కీలక మంత్రిత్వ శాఖలు దశాబ్దాల క్రితం నిర్మించిన శాస్త్రి భవన్, కృషి భవన్, ఉద్యోగ్ భవన్ వంటి పాత భవనాల్లో, మరికొన్ని అద్దె భవనాల్లో పనిచేస్తున్నాయని ప్రధా ని గుర్తుచేశారు. "వివిధ కార్యాలయాలు చెల్లాచెదురుగా ఉండటంతో దాదాపు 8,000 నుంచి 10,000 మంది ప్రభుత్వ ఉద్యోగులు పనుల నిమిత్తం రోజూ ప్రయాణించాల్సి వస్తోంది. ఇది ట్రాఫిక్ రద్దీకి, ఇంధన ఖర్చులకు కారణమవడమే కాకుండా, పని సామర్థ్యాన్ని కూడా తగ్గి స్తోంది. కర్తవ్య భవన్ నిర్మాణంతో ఈ సమస్యకు పరిష్కారం లభించింది" అని ప్రధాని వివరిం చారు. ఈ కొత్త భవనం ప్రజానుకూలం, పర్యావరణ అనుకూలం అని ఆయన అభివర్ణించారు.

**ఒకేచోట ఏడు కీలక మంత్రిత్వ శాఖలు**

కర్తవ్య పథ్‌లో నిర్మించిన ఈ భవనంతో పాలనలో వేగం, మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. సుమారు 1.5 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో, రెండు బేస్‌మెంట్లు, ఏడు అంతస్తులతో (గ్రౌండ్ ం 6) ఈ భవనాన్ని నిర్మించారు. ఇందులో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, విదేశీ వ్యవహారాలు, గ్రామీణాభివృద్ధి, ఎంఎస్ఎంఈ, సిబ్బంది-శిక్షణ పెట్రోలి యం-సహజ వాయువు, ప్రధాన శాస్త్రీయ సలహాదారు కార్యాలయాలు కొలువుదీరనున్నాయి.

**అత్యాధునిక, పర్యావరణ హిత నిర్మాణం**

కర్తవ్య భవన్ నిర్మాణంలో అత్యాధునిక టెక్నాలజీతో పాటు పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేశారు. సాధారణ భవనాలతో పోలిస్తే 30 శాతం తక్కువ విద్యుత్‌ను వినియోగించేలా డిజైన్ చేశారు. భవనం లోపల ఉష్ణోగ్రతను నియంత్రించి, బయటి శబ్దాలను తగ్గించేందుకు డబుల్ గ్లేజ్డ్ ఫ్యాసేడ్ విండోలను అమర్చారు. ఆక్యుపెన్సీ సెన్సర్లతో కూడిన ఎల్ఈడీ లైటింగ్, విద్యుత్ ఆదా చేసే స్మార్ట్ లిఫ్టులు ఏర్పాటు చేశారు. భవనం పైకప్పుపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఏటా 5.34 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. జీరో డిశ్చార్జ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విధానాన్ని అనుసరిస్తున్నారు. వ్యర్థ జలాలను శుద్ధి చేసి తిరిగి వినియో గిస్తారు. నిర్మాణంలో కూడా రీసైకిల్ చేసిన వ్యర్థాలను వాడారు. ఐడీ కార్డు ఆధారిత ప్రవేశాలు, ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రానిక్ నిఘా, సెంట్రలైజ్డ్ కమాండ్ సిస్టమ్‌తో భద్రతను కట్టుదిట్టం చేశారు.

**ఇవి పాలనా దేవాలయాలు: ప్రధాని మోదీ**

ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. ఆగస్టు నెల విప్లవాల మాసమని అన్నారు. "గత కొన్నేళ్ళుగా రాజధానిలో నిర్మించిన నూతన పార్లమెంట్ భవనం, భారత్ మండపం, జాతీయ యుద్ధ స్మారకం, యశోభూమి కన్వెన్షన్ సెంటర్ల సరసన ఇప్పుడు కర్తవ్య భవన్ కూడా చేరింది. ఇవి సాధారణ కట్టడాలు కావు, వికసిత భారత్ భవిష్యత్తును తీర్చిదిద్దే పాలనా దేవాలయాలు" అని ఆయన పేర్కొన్నారు. 21వ శతాబ్దపు భారతదేశానికి పాతకాలపు పనివిధానాలు సరిపోవని, అందుకే ఈ పరివర్తన అత్యవసరమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

### ఆ 65 లక్షల మంది

# ఓటర్ల వివరాలివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

దీనిపై విచారణను 12వ తేదీకి వాయిదా వేసింది. బీహార్‌లో ఎస్ఐఆర్‌ను సవాలు చేస్తూ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్)అనే ఎన్‌జిఓ గతంలో సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. తాజాగా ముసాయిదా ఓటర్ల జాబితాలో తొలగించిన వారి వివరాలు వెల్లడించాలంటూ మరో పిటిషన్ దాఖలు చేసింది. దానిపై బుధవారం విచారణ జరిపిన సుప్రీం పై ఆదేశాలు జారీ చేసింది. ఓటర్ల పేర్లు తొలగించడానికి వివిధ రకాల కారణాలు ఉండొచ్చునని, చనిపోవడం లేదా రాష్ట్రం నుంచి శాశ్వతంగా బయటకు వెళ్ళిపోవడం, రెండు చోట్ల పేర్లు వుండడం, ఎక్కడున్నారో తెలియకపోవడంవంటి పలు కారణాలు వుండొచ్చు నని ఆ పిటిషన్ పేర్కొంది. అయితే, తొలగించిన ప్రతి పేరుకు గల కారణాలను విడివిడిగా చూపలేదు. నియోజకవర్గాల వారీగా లేదా బూత్‌ల వారీగా ఏ విధంగానైనా ముసాయిదాలో చూపలేదని పేర్కొంది. నిర్దిష్ట కారణాలతో తొలగించిన ఓటర్ల వివరాలను అసెంబ్లీ, బూత్‌ల వారీ జాబితా వారీగా అందజేయాలని కోరింది. తొలగించిన పేర్ల జాబితాను కొన్ని రాజకీయ పార్టీలకు అందజేశారని, అయితే వాటివల్ల ఉపయోగం లేకుండా పోయిందని పిటిషనర్ల తరపున ప్రశాంత్ భూషణ్ పేర్కొన్నారు. ఇలాంటి తొలగింపులకు గల కారణాలు ఇవ్వనందున వాటిని క్రాస్ చెక్ చేసుకోవడానికి కూడా వీల్లేకుండా పోయిందని అన్నారు. 'బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓ) సిఫారసు చేయలేదు' అని గుర్తించబడిన ఎన్యూమరేషన్ ఫారాల ఓటర్ల వివరాలను అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా, బూత్‌ల వారీగా ప్రచురించాల్సిందిగా పిటిషనర్లు కోరారు. దర్భంగా, కైమూర్ జిల్లాలకు సంబంధించిన సమాచారం చూసినట్లైతే బీఎల్ఓ సిఫారసు చేయలేదు అని రాసిన ఎన్యూమరేషన్ ఫారాలను పెద్ద సంఖ్యలో అప్‌లోడ్ చేశారని పిటిషనర్ల తరపున ప్రశాంత్ భూషణ్ తెలిపారు. దర్భంగా, కైమూర్ జిల్లాల్లో వరుసగా 10.6, 12.6శాతం మందికి ఇలా బీఎల్ఓ సిఫారసు చేయలేదనే ముద్ర వేసి వుందని పేర్కొన్నారు.

## అదానీపై అమెరికాలో దర్యాప్తు

(మొదటి పేజీ తరువాయి)

భారత్ తమకు మంచి వాణిజ్య భాగస్వామి కాదని, రాబోయే 24 గంటల్లో సుంకాలను చాలా గణనీయంగా పెంచుతానని ట్రంప్ ప్రక టించిన నేపథ్యంలో రాహుల్ స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. "భారత్ ప్రజలారా, దయచేసి అర్థం చేసు కోండి. అధ్యక్షుడు ట్రంప్ పదే పదే బెది రింపులు చేసినప్పటికీ ప్రధాని మోడీ మౌనం గా ఉండడానికి కారణం అదానీపై కొనసాగుతున్న అమెరికా దర్యాప్తు. మోడీ, అంబానీ- అదానీ, రష్యన్ చమురు ఒప్పం దాల మధ్య ఆర్థిక సంబంధాలను బహిర్గతమవుతాయి. మోడీ చేతులు కట్టేశారు" అని రాహుల్ గాంధీ ఆరోపించారు. అయితే రాహుల్ పోస్ట్‌పై ప్రభుత్వం లేదా అదానీ గ్రూప్ నుంచి స్పందన రాలేదు.

## 'లూలూ'కు చౌకగా భూమిపై ప్రభుత్వానికి నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

యాజమాన్యానికి నోటీసులిచ్చింది. విచారణను అక్టోబరు 8కి వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. విశాఖపట్నంలో 13.5 ఎకరాలను, విజయవాడలో 4.15 ఎకరాల భూమిని నామమాత్రపు ధరకు లూలూ మాల్ మేనేజ్‌మెంట్‌కు ఇవ్వడాన్ని విశాఖకు చెందిన పాకా సత్యనారాయణ, విజయవాడకు చెందిన న్యాయవాది సిహెచ్ వెంకటేశ్వరరావు వేర్వేరుగా వేసిన పిల్స్‌ను హైకోర్టు విచారించింది. బిడ్స్ లేకుండానే భూమి ఇచ్చారని, భూ కేటాయింపు జిఓను రద్దు చేయాలని పిటిషనర్ల లాయర్లు కోరారు. నూతన పారిశ్రామిక విధానంలో భాగంగానే లూలూ మాల్‌కు భూ కేటాయింపు జరిగిందని ఎజి దమ్మాలపాటి శ్రీనివాస్ చెప్పారు.

### బీసీ రిజర్వేషన్లకు

# మోడీనే అడ్డంకి

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వొద్దని రాష్ట్రపతిపై ఏమైనా ఒత్తిడి చేశారా..! కావొచ్చు.. బలహీన వర్గాలన్నీ ఆలోచన చేయాలి' అని ముఖ్యమంత్రి అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనలో తెలంగాణ ప్రజల శక్తిని తక్కువగా అంచనా వేయొద్దని, బీసీ బిల్లులకు ఆమోదం తెలపకపోతే ప్రధాని మోడీకి తెలంగాణ తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లను ఆమోదిస్తారా? గద్దె దిగుతారా? అని నిలదీశారు. బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా నిర్వహించిన కాంగ్రెస్ పోరుబాటలో ప్రధాని మోడీ టార్గెట్‌గా సీఎం రేవంత్ రెడ్డి కీలక కామెంట్లు చేశారు. 'నరేంద్రమోడీకి జంతర్ మంతర్ చౌరస్తా నుంచి సవాల్ విసురుతున్నా.. మా డిమాండ్‌ను ఆమోదిస్తారా? లేదంటే మిమ్మల్ని గద్దెదించి, ఎర్రకోట మీద మూడు రంగుల జెండా ఎగరేసి, రాహుల్ గాంధీని ప్రధానిని చేసి, 42శాతం బీసీ రిజర్వేషన్లు సాధించుకోమంటారా? ఏది ఏమైనా బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు మేం నిద్రపోం..' అని హెచ్చరించారు. 'అయ్యా.. నరేంద్రమోడీగారూ.. మీ గుజరాత్ నుంచి గుంట భూమి అడగలే. మీ పోరుబందర్ పోర్ట్ నుంచి గుక్కెడు నీళ్లడగలే.. మా తెలంగాణలో మా గడ్డ మీద బలహీనవర్గాలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చుకుంటామంటే మీ గుజరాత్ వాళ్లకు వచ్చిన కడుపు మంట ఏంటి? రిజర్వేషన్ల కోసం బిల్లులు ఆమోదించి.. 4.5 కోట్ల మంది ప్రజలు విజ్ఞప్తి చేస్తే మా బిల్లులను తుంగలో తొక్కే అధికారం మీకెవరిచ్చారని అడుగుతున్నా.. ' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

**మా పోరాటం మోడీతోనే**

'మన పోరాటం.. రిజర్వేషన్లకు అడ్డుపడుతున్న చంద్రశేఖర్‌రావుతోనో, కిషన్ రెడ్డితోనో, బండి సంజయ్‌తోనో, రాంచందర్‌రావుతోనో కాదు.. మన పోరాటం కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోడీతో..' అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'బలహీన వర్గాలకు న్యాయం చేయాలన్న ఆలోచన నరేంద్రమోడీకి లేదు.. కానీ ఆయన మోచేతి నీళ్లు తాగుతున్న కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాంచందర్‌రావుకు ఏమైంది? మీరు మళ్లీ తెలంగాణకు రారా? తెలంగాణ ఓట్లు మీకు అవసరం లేదా? బీఆర్ఎస్ తెంపుకున్నట్టే తెలంగాణ రాష్ట్ర ప్రజలతో మీ పేగు బంధం తెంపుకున్నారా? ' అని ప్రశ్నించారు.

**సాధించి తీరుతాం**

బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్యా ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించి తీరుతామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన బీసీ రిజర్వేషన్ల బిల్లును రాష్ట్రపతి, కేంద్ర ప్రభుత్వం ఆమోదించకుండా తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ బిల్లులు ఆమోదం పొందే వరకు తాము నిద్రపోమని స్పష్టం చేశారు. బలహీన వర్గాలపై కక్ష గట్టిన గత సీఎం కేసీఆర్ 50 శాతం రిజర్వేషన్లు మించకుండా చట్టం చేశారని విమర్శించారు. 'నాడు కేసీఆర్ చేసిన చట్టం నేడు రిజర్వేషన్లకు గుదిబండగా మారింది. తెలంగాణలో బలహీన వర్గాల బిడ్డలు సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మేయర్లు కాకుండా అడ్డుగా ఉన్న ఈ చట్టాన్ని తొలగించాలని తాము ఆర్డినెన్స్ చేసి గవర్నర్‌కు పంపాం. దానిని ఆమోదించడం లేదు. వెనుకబడిన వర్గాలకు స్థానిక ఎన్నికల్లో% విద్యా, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు ఢిల్లీలో ధర్నాకు దిగాం. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచైనా సాధించి తీరుతాం' అని ముఖ్యమంత్రి అన్నారు.

42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనకు తెలంగాణలోనైనా ధర్నా చేయొచ్చని% కానీ అక్కడ ధర్నా చేస్తే స్థానిక పార్టీలు మాత్రమే వస్తాయని.. అందుకే ఢిల్లీలో ధర్నా చేస్తున్నామని సీఎం రేవంత్ తెలిపారు. ఢిల్లీలో చేపట్టిన ధర్నాలో కాంగ్రెస్‌కు చెందిన పలువురు ఎంపీలతో పాటు ఇండియా బ్లాక్‌లోని సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, ఎన్సీపీ, వామపక్షాలకు చెందిన వంద మంది ఎంపీలు పాల్గొని సంఘీభావం తెలియజేశారని ఆయన తెలిపారు.

**బీసీ రిజర్వేషన్ల పెంపునకు ఆ నలుగురు. అడ్డు**

తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్, కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాంచందర్‌రావులు బీసీ రిజర్వేషన్ల పెంపునకు అడ్డుపడుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. వీళ్లకు తెలంగాణ బీసీల అవసరం లేదా? అని ప్రశ్నించారు.

# స్మార్ట్ మీటర్ల కోసం అప్పులు

(మొదటి పేజీ తరువాయి)

రుణం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుతో పాటు, అందుకు అవసరమైన ఇతర పనులను పూర్తి చేసేందుకు రుణాలు తీసుకోవడానికి డిస్కమ్‌లకు అనుమతి ఇవ్వాలంటూ ఇంధనశాఖ చేసిన ప్రతిపాదనను మంత్రివర్గం ఆమోదించింది. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుండి ఎపిఎస్‌పిడిసిఎల్ రూ.3,544.57కోట్లు, ఎపిసిపిడిసిఎల్‌ల రూ.1,029.37కోట్ల రూపాయల రుణం తీసుకునేందుకు కేబినెట్ అనుమతించింది. మంత్రివర్గ నిర్ణయాలను మీడియాకు వివరించిన పౌరసంబంధాలు, గృహ నిర్మాణ శాఖమంత్రి కొలుసు పార్థసారథి ఈ నిర్ణయంతో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వేగవంతమవుతుందని చెప్పారు. రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం(ఆర్‌డిఎస్ఎస్)లో భాగంగా విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లను డిస్కమ్‌లు ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. రుణం తీసుకోవడానికి ఇంధన శాఖ చేసిన ప్రతిపాదనలను ఆమోదించడం ద్వారా ఆర్‌డిఎస్ఎస్ అమలు వేగవంతం అవుతుందని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో ఐటీ, ఐటిఇఎస్ కంపెనీలకు ఎకరం 99పైసలకే భూములు అప్పగించేందుకు ఎపి ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్ హబ్(లిఫ్ట్)(2024-29)పాలసీ-4.0కు ఆమోదం తెలిపామన్నారు. రాష్ట్రంలో ఐటీ, సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు. బెంగళూరు,హైదరాబాద్ గుర్గావ్ వంటి నగరాల్లో భూముల ధరలు విపరీతంగా పెరిగాయని, ట్రాఫిక్ రద్దీ, వ్యయాలు పెరుగుతున్నాయని ఐటీ కంపెనీలు భావిస్తున్నాయని తెలిపారు. వీటిని ఇతర చోట్ల ఏర్పాటు చేసుకోవాలని ఆలోచన చేస్తున్నాయని చెప్పారు. ఆ కంపెనీల ఆహ్వానించేందుకు అత్యంత తక్కువ ధరకు భూములను అందుబాటులో ఉంచడం ఈ పాలసీ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

**భూ సేకరణకు 7,500 కోట్ల రుణం**

ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, మౌలిక సదుపాయాల సంస్థ(ఎపిఐఐసి)కి ద్వారా 30వేల ఎకరాల భూములను సమీకరించాలని నిర్ణయించామని చెప్పారు. ఈ భూముల సేకరణ కోసం అవసరమైన రూ.7500కోట్ల రుణాన్ని సేకరించాలని ఎపిఐఐసి ప్రతిపాదనను ఆమోదించామని తెలిపారు. రాష్ట్రంలో 22 చోట్ల పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న హొటళ్లు, రిసార్ట్స్ నిర్వహణ, కార్యకలాపాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. రాష్ట్రంలోని మహిళలకు ఈ నెల 15వ తేదీ నుంచి ఉచిత బస్సు ప్రయాణం అమలు కానుందని, ఈ పథకానికి 'స్త్రీ శక్తి'గా నామకరణం చేశామని చెప్పారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మాత్రమే అనుమతి ఉంటుందని, ఆధార్, ఓటర్, రేషన్ కార్డులను చూపించాలని వెల్లడించారు. మద్యం దుకాణాల్లో పర్మిట్ రూమ్స్‌కు అనుమతి ఇస్తున్నామని చెప్పారు. పర్మిట్ లైసెన్స్ ఫీజు కింద రూ.5 నుంచి 7.5లక్షలు వసూలు చేయాలని నిర్ణయించామని తెలిపారు. దీనివల్ల రూ.256కోట్ల అదనపు ఆదాయం వస్తుందన్నారు. మంత్రివర్గ ఉపసంఘం ప్రతిపాదనల ఆధారంగా ఎక్సైజ్ శాఖ రూపొందించిన బార్ పాలసీ-2025-28కి ఆమోదం చెప్పామన్నారు. అదేవిధంగా బార్లు తెరిచే సమయాన్ని కూడా రాత్రి అదనంగా గంట పెంచుతూ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. హెయిర్ కటింగ్ సెలూన్లకు అందించే ఉచిత విద్యుత్‌ను 150 నుంచి 200 యూనిట్ల వరకు పెంచామని చెప్పారు. పాఠశాల, ఉపాధ్యాయుల క్రమబద్ధీకరణ పేరుతోవైసిపి ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖలో విడుదల చేసి జిఓ 117కు బదులుగా కూటమి ప్రభుత్వం విడుదల చేసిన 19,20,21, 33 జిఓలకు ఆమోదం తెలిపామని తెలిపారు.

# ఎస్ఐఆర్‌పై చర్చించాలి

(మొదటి పేజీ తరువాయి)

కూడా ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. దీంతో సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. ఈ గందరగోళ పరిస్థితుల్లోనే ఎటువంటి చర్చ లేకుండా మర్చంట్ షిప్పింగ్ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించారు. అనంతరం సభను గురువారానికి వాయిదా వేశారు. ఇటు రాజ్యసభలోనే ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. దీంతో సభ తొలుత మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడగా, తిరిగి ప్రారంభమైన సభలోనూ ఆందోళన కొనసాగడంతో ఏకంగా గురువారానికి వాయిదా పడింది.

**పార్లమెంట్‌లో ఎస్ఐఆర్‌పై చర్చించలేం: మంత్రి రిజిజు**

పార్లమెంట్‌లో బీహార్ ఎస్ఐఆర్‌పై చర్చించలేమని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. ఆయన లోక్‌సభలో మాట్లా డుతూ ఓటర్ల జాబితా సవరణ అంశంపై పార్లమెంట్‌లో చర్చించడం అంటే, అన్ని నియమాలను ఉల్లంఘించినట్టు అవుతుం దని ఆయన అన్నారు. సభ సజావుగా సాగేందుకు ప్రతిపక్ష ఎంపీలు సహకరించాలని ఆయన కోరారు. సభా కార్యక్రమాను అడ్డుకోరాదన్నారు. మనం చర్చించడం కోసం చాలా ముఖ్యమైన విషయాలు ఉన్నాయని, జాతీయ క్రీడా విధాన్ని తామేమీ ప్రవేశపెట్టడంలేదన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం అనేది వ్యక్తిగత వ్యవస్థ అని, సుప్రీంకోర్టులో ఆ కేసు ఉందని, ఆ అంశాలను పార్లమెంట్‌లో చర్చించలేమని మంత్రి రిజిజు అన్నారు. ఎస్ఐఆర్ అనేది ఎన్నికల కమిషన్ నిర్వహించే రాజ్యాంగ ప్రక్రియ అని, పార్లమెంటరీ చర్చకు లోబడి ఉండదని అన్నారు.

**జవాబుదారీతనం నుంచి తప్పించుకోవటమే.. ప్రియాంక గాంధీ**

బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై మాట్లాడిన కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ప్రభుత్వం జవాబుదారీతనం నుంచి తప్పించు కుంటుందని ఆరోపించారు. చర్చను నిర్వహించడానికి అధికార పార్టీ విముఖత వ్యక్తం చేయడం దారుణమన్నారు. ప్రతిపక్షం చర్చ కోసం మాత్రమే అడుగుతోందని, ప్రభుత్వం కోరుకుంటే ఈ సమస్యను పరిష్కరించవచ్చని అన్నారు. " అధికారపక్ష సభ్యులు అంత బలహీనంగా మారారా? వారు పార్లమెంటును నడపలేకపోతున్నారు. ట్రంప్ వ్యాఖ్యలపై స్పందించలేకపోతున్నారు" అని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యం కోసం ఎన్నికల సంస్కరణలపై చర్చించే ప్రాముఖ్యతను డీఎంకే ఎంపీ కనిమొళి స్పష్టం చేశారు. ప్రభుత్వం దానిని అనుమతించక పోవడాన్ని విచారకరమని అన్నారు.

**మేం చర్చ జరపాలని కోరుతున్నాం : ఖర్గే**

రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ "స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై చర్చ జరగాలని మేం కోరుతున్నాం. ప్రతి ఒక్కరూ స్పీకర్, చైర్మెన్, ప్రభుత్వాన్ని చాలా ప్రశాంతంగా అడుగుతూనే ఉన్నారు. మా ఓట్లు దొంగలించకూడదు. ఓటర్ల జాబితాలోని అవకతవకలు, ఓట్ల దొంగతనం గురించి చర్చించడానికి మాకు సమయం కావాలని కోరుతున్నాం. పూర్తి చర్చ జరిగితే వారు ఎక్కడ తప్పులు చేసినా, రాజ్యాంగ విరుద్ధమైన రీతిలో ఏమి చేసినా సమాధానం, సూచనలు ఇవ్వగలం. దేశ ప్రయోజనాల దృష్ట్యా, ముఖ్యంగా తమ హక్కులను కోల్పోతున్న ఓటర్లను మనం రక్షించగలం. 2023 జూలై 21న అప్పటి చైర్మెన్ జగదీప్ ధన్కర్ మాట్లాడుతూ సభకు ప్రతిదాని గురించి చర్చించే హక్కు కలిగి ఉంది. ఎవరి ఓట్లు కోతకు గురవుతున్నాయి? మైనార్టీ ఓట్లు కోతకు గురవుతున్నాయి. దళిత ఓట్లు కోతకు గురవుతున్నాయి. గిరిజన ఓట్లు కోతకు గురవుతున్నాయి. ఉపాధి హామీ కార్మికుల ఓట్లు కోతకు గురవుతున్నాయి, వలస కార్మికుల హక్కులను కోల్పోతున్నారు" అని అన్నారు.

**పార్లమెంట్ ఆవరణలో ఆందోళన**

పార్లమెంట్ ఆవరణలో బీహార్‌లో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)కి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. మంగళవారం పార్లమెంట్ ఆవరణంలో ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేట్టారు. ప్లకార్డులు పట్టుకుని మోడీ ప్రభుత్వానికి, కేంద్ర ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నినాదాల హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, ప్రియాంక గాధీ, సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్, డీఎంకే ఎంపీ కనిమొళి ఇతర ప్రతిపక్ష ఎంపీలు పాల్గొన్నారు. ఎస్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సభ వాయిదా పడిన తరువాత కూడా ప్రతిపక్షాలు తమ ఆందోళనను కొనసాగించాయి.

# సంపాదకీయం

## అప్‌డేట్ కాకపోతే..ఇంటికే




ఉద్యోగాలు ఊడిపోతున్నాయి. లే-ఆఫ్స్ ఐటీ ఉద్యోగుల్లో వణుకుపుట్టిస్తున్నాయి. ఒక్క జూలై నెలలోనే 23 వేల 486 మంది ఉద్యోగులను ఐటీ కంపెనీలు ఉద్యోగాల నుంచి తొలగించాయి. అంతే కాదు.. 2025లో ఇప్పటి వరకూ.. ఈ 7 నెలల వ్యవధిలో 112 ఐటీ కంపెనీలు 81 వేల 28 మందిని ఉద్యోగాల నుంచి తొలగించిందంటే ఐటీ ఉద్యోగుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. లే-ఆఫ్స్ చేసిన కంపెనీల్లో టెక్ దిగ్గజ కంపెనీలైన మెటా, గూగుల్, ఇంటెల్ కూడా ఉన్నాయి.టెక్ ఇంజినీర్లకు గడ్డు పరిస్థితి ఎదురవనుంది. అనేక టెక్ కం పెనీలు వేలాది మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికేందుకు సిద్ధమవుతున్నాయి. టీసీఎస్ మొదలుకొని ఇంటెల్, మైక్రోసాఫ్ట్, మెటా కంపెనీలు తమ ఉద్యోగులను తొలగించనున్నట్టు పేర్కొంది. మారుతున్న వ్యాపార అవసరాలు, కృత్రిమ మేధస్సు (ఏఐ)పై పెట్టుబడి, ఖర్చుల్ని తగ్గించుకునేందుకే ఈ నిర్ణ యం తీసుకుంటున్నట్టు తెలిపాయి. అయితే కొన్ని కంపెనీలు ఈ కోతల సామర్థ్యం, పునర్నిర్మాణంలో భాగంగా చేస్తున్నామని చెబుతున్నాయి.భారతీయ అతిపెద్ద టెక్ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్).. దాని వర్క్‌ఫోర్స్‌ను 2 శాతం మేర తగ్గించనుంది. దీనివల్ల టీసీఎస్‌లో 12వేల మంది తమ ఉద్యోగాలను కోల్పోను న్నారు. ఏఐ ఆధారిత ఉత్పాదకత లా భాలే లేఆఫ్స్‌కు కారణమని కంపెనీ పేర్కొంది.మైక్రోసాఫ్ట్ కూడా ఈ ఏడాది 15వేల మందిని తొలగించింది. దీంతో పాటు సరైన ప్రదర్శన చేయని మరో 2వేల మందికి కూడా కంపెనీ ఉద్వాసన పలికింది. మైక్రోసాఫ్ట్ ఏఐ మౌలిక సదుపాయాల కోసం దాదపుగా 80 బిలియన్ డాలర్లు ఖర్చు పెడుతోంది. దీంతో ఖర్చుల్ని తగ్గించుకోవడానికి ఉద్యోగుల్ని తీసేస్తున్నట్టు తెలిపింది.ఇంటెల్ ఈ సంవత్సరంలో దాదాపు 24వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన పలకాలని చూస్తోంది. జర్మనీ, పోలండ్‌కు చెందిన ప్రాజెక్టులను కూడా రద్దు చేసుకుంటున్నట్టు సమాచారం. చిప్ మేకర్ అయిన ఇంటెల్.. ఎన్విడియా నుంచి తీవ్ర పోటీ ఎదుర్కొంటుంది.ఈ ఏడాది ప్రారంభంలోనే మెటా తన వర్క్‌ఫోర్స్ నుంచి 5 శాతం మందిని తొలగించింది. తాజాగా కంపెనీలోని రియాలిటీ ల్యాబ్స్ విభాగంలో ఉద్యోగుల లేఆఫ్స్‌ను ప్రకటించింది. వీటితో పాటు జపాన్ టెక్ దిగ్గజం పానాసోనిక్ కూడా లేఆఫ్స్ జాబితాలో చేరిందిలా ఒకరిద్దరు కాదు.. వేలాది మందిని ఐటీ కంపెనీలు ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నాయి. "ప్రాజెక్టులు లేవు.. పనితీరు సరిగ్గా లేదు'' అని పేర్కొంటూ సైలెంట్?లేఆఫ్స్ చేపడుతున్నాయి. ప్రాజెక్టులు, స్కిల్స్ లేవని చెబుతూ రిజైన్ చేయాలని బెంచ్?పై ఉన్న ఉద్యోగులపై ఒత్తిడి తెస్తున్నాయి. వాళ్లతో ఎలాగోలా రిజైన్ చేయించి, ఇంటికి పంపించి వేస్తున్నాయి. రానున్న రోజుల్లో ఈ లేఆఫ్స్?మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.ఐటీ రంగాన్ని కుదిపేస్తున్న సైలెంట్ లేఆఫ్స్?కు ముఖ్య కారణం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అని? నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం ఐటీ రంగంలో ఏఐ వినియోగం పెరిగింది. మనుషులు చేయాల్సిన పనులు మొత్తం ఏఐ టూల్స్ చేస్తున్నాయి. దీంతో కంపెనీలు తమ ప్రొడక్షన్ ?కాస్ట్?ను తగ్గించుకోవడంలో భాగంగా ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఉద్యోగులను తొలగిస్తే జీతాల భారం తగ్గుతుందని భావిస్తున్నాయి.బెంచ్?పై ఉన్న ఉద్యోగులతో బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నాయి. ఐటీ కంపెనీల్లో ఏఐ కారణంగానే చాలా మంది ఉద్యోగాలు కోల్పోతున్నారని, రానున్న రోజుల్లో ఏఐ వాడకం మరింత పెరుగుతుందని నిపుణులు అంటున్నారు. ఐటీ రంగంలో నిలదొక్కుకోవాలంటే లేటెస్ట్ టెక్నాలజీని ఎప్పటికప్పుడు నేర్చుకోవాలని, స్కిల్స్ పెంచుకోవాలని సూచిస్తున్నారు. ఏఐ, రోబోటిక్స్, మెషీన్ ?లర్నింగ్, డేటా అనలిటిక్స్ ?వంటి కోర్సులు నేర్చుకున్నోళ్లకు ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉండే చాన్స్ ఉందని చెప్పారు.. ఖర్చులను తగ్గించుకు నేందుకు దాదాపు 10వేల మంది ఉద్యోగులను తొలగించేందుకు ప్లాన్ సిద్ధం చేసు కుంది. మరో వైపు ఫ్ట్ వేర్ ఇండస్ట్రీలో జరుగుతున్న పరిణామాల ప్రభావం కీలక రంగాలపై పడటం ఖాయంగా కనిపిస్తోంది. దక్షిణాదిలో యువత ఎక్కువగా అధిక ఆదాయం ఉన్నవారు సాఫ్ట్ వేర్ ఉద్యోగులే అవుతున్నారు. వారు పెట్టే ఖర్చులు, పెట్టుబడుల కారణంగానే చాలా రంగాల్లో దూకుడు కనిపిస్తోంది. ఇప్పుడు మెల్లగా సాఫ్ట్ వేర్ రంగంలో మార్పులు వస్తున్నాయి. ఈ క్రమంలో లే ఆఫ్స్ సీజన్ వచ్చేసింది. సాధారణంగా మాంద్యం వల్ల లే ఆఫ్స్ ప్రకటిస్తారు..కానీ ఇప్పుడు ఏఐ, ఆటోమేషన్ వల్ల తొలగింపులు జరుగుతున్నాయి.మాస్ లే ఆఫ్స్ కారణంగా ఉద్యోగుల్లో ఓ రకమైన భయం నెలకొంది. ఉద్యోగ భద్రత గండంగా మారడంతో దీర్ఘకాలిక పెట్టుబడులపై వారు వెనుకడుగు వేసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇళ్ల కొనుగోలు వంటి వాటిపై ఆలోచిస్తారు. ఇప్పటికే ఐటీ కారిడార్ ఉన్న హైదరాబాద్ వెస్ట్ లో రియల్ ఎస్టేట్ పరిస్థితి మెరుగుపడలేదు. మార్కెట్ కు మించి లగ్జరీ ప్రాజెక్టులు నిర్మించేస్తున్నారన్న అభిప్రాయం ఉంది. ఇప్పుడు ఇంకా డిమాండ్ తగ్గనుంది. సాఫ్ట్ వేర్ పరిశ్రమలో ఎంత పెద్దస్థాయిలో ఉన్నా.. సరే కాస్త ఆలోచిద్దామని అనుకునేవారి సంఖ్య పెరుగుతుంది.ఇతర రంగాల వారిపై ఈ లేఆఫల ప్రభావం ఎంత ఉంటుందన్నదానిపై అంచనాలు లేవు. అయితే రియల్ ఎస్టేట్ మందగిస్తే ఇతర రంగాల్లోనూ వ్యాపారాలు మందగిస్తాయి. ఇప్పుడు ఆర్థిక వ్యవస్థ అంతా ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటుంది. ఎక్కడ బలహీనమైనా పరిస్థితి తారుమారవుతుంది. అందుకే.. కొంత కాలం ఇబ్బందికర పరిస్థితులు తప్పవన్న అభిప్రాయం వినిపిస్తోంది.

## పని తీరు మార్చుకోండి

**-జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ**

**- గార్లదిన్నె మండల పరిషత్ కార్యాలయం తనిఖీ**

**- రికార్డుల పరిశీలన**


**- ఉద్యోగుల హాజరు గురించి అడిగి తెలుసుకున్న చైర్ పర్సన్**

**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం, ఆగస్టు 6:** ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ గార్లదిన్నె మండల పరిషత్ కార్యాలయాన్ని బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఉద్యోగుల హాజరు గురించి ఆరా తీశారు.పని తీరు మార్చు కోవాలని ఆదేశించారు.



# గేమ్ ఛేంజర్‌గా సూపర్ సిక్స్

**విజయవాడ - సూర్యా వాస్తవం:** ఆయన అభివృద్ధి జపమే చేస్తారు. సంక్షేమాన్ని బ్యాలెన్స్ చేయలేరు. సాధ్యం కాని హామీలిచ్చారు. బాబు షూరిటీ..మోసం గ్యారెంటీ అంటూ గగ్గోలు పెట్టింది అపోజిషన్. కానీ ఫస్ట్ టైమ్ టీడీపీ హిస్టరీ లోనే కాదు..సీఎంగా చంద్రబాబు ట్రాక్ రికార్డు లోనూ..ఈసారి సంక్షేమానికి టాప్ ప్రయారిటీ ఇస్తున్నారు. పలానా స్కీమ్ అమలు అంత ఈజీ కాదు. ఏం చేసినా ఇంప్లిమెంట్ చేయలేరన్న భావించిన పథకాలను కూడా ఒక్కొక్కటి ఇచ్చుకుంటూ పోతున్నారు చంద్రబాబు. చంద్రబాబు అంటే ఓన్లీ డెవలప్‌మెంట్ మాత్రమేనని ఉండే ట్యాగ్‌లైన్‌ను మార్చేస్తున్నారు. ఆడా ఉంటా..ఈడా ఉంటా అన్నట్లుగా ఇటు అభివృద్ధి..అటు సంక్షేమం రెండూ చేస్తా అంటున్నారు. రెండింటిని బ్యాలెన్స్ చేస్తానని చేతలతో ప్రూవ్ చేస్తున్నారు సీఎం చంద్రబాబు. అపోజిషన్ విమర్శలకు అమలుతోనే సమాధానం చెబుతూ వస్తున్నారు.అస్సలు అమలు చేయలేరు. సాధ్యం కాదు. ఖజానా ఖాళీగా ఉంది. ఈ స్కీమ్ అమలు చేయాలంటే అన్ని కోట్లు కావాలి. ఆ స్కీమ్ ఇంప్లిమెంట్ చేయాలంటే ప్రభుత్వ ఆస్తులు అమ్మినా సరిపోవు అంటూ..ఎక్కడా లేని లెక్కలన్నీ వేసింది అపోజిషన్. పైగా బాబు అంటే అభివృద్ధి పేరుతో కాలం వెళ్లదీస్తారు తప్ప..సంక్షేమం జోలికి వెళ్లరని..పేదోడికి సాయం చేయడం ఆయన డిక్షనరీలోనే లేదని గాయిగత్తర లేపింది వైసీపీ. కానీ తనకంటూ ఓ స్టైల్ ఉందని.. అసాధ్యాన్ని సుసాధ్యం చేయడమే తన స్పెషాలిటీ అంటూ సంక్షేమానికి టాప్ ప్రయారిటీ ఇస్తున్నారు సీఎం చంద్రబాబు.టీడీపీ హిస్టరీలోనే అతి పెద్ద సంక్షేమ పథకం తల్లికి వందనం స్కీమ్‌తో ప్రతి ఇంటికి చేరువైంది కూటమి సర్కార్. ఆ తర్వాత అమలు సాధ్యం కాదని..రైతులకు సాయం చేయలేరని నమ్ముకున్న వైసీపీకి మరోసారి షాక్




ఇచ్చారు సీఎం చంద్రబాబు. ఏకంగా అన్నదాత సుఖీభవ స్కీమ్‌ను ఇంప్లిమెంట్ చేసి రైతు రాజ్యంగా చెప్పుకుంటున్నారు. అధికారంలో వచ్చిన తొలినాళ్లలోనే పెన్షన్‌ను 4వేలకు పెంచి ప్రతీ నెల ఫస్ట్‌నే ఇస్తున్నారు. ఈ మూడు స్కీమ్స్ విషయంలో అపోజిషన్‌తో పాటు అందరి అంచనాలను చంద్రబాబు తలకిందుకులు చేశారనే చెప్పాలి. వృద్ధులు, వికలాంగులకు పెన్షన్లు ఇచ్చి పేదలకు దగ్గరైంది కూటమి సర్కార్. ఇక తల్లికి వందనమే తమ ఆయుధమకున్న వైసీపీకి..ఆ స్కీమ్ ఇంప్లిమెంట్‌తో తన థర్టీ ఇయర్స్ ఎక్స్‌పీరియన్స్ ఏంటో చూపించారు చంద్రబాబు. నీకు పదిహేను..నీకు పదిహేను..నీకు పదిహేను..అంటూ వైసీపీ అధినేతతో సహా ఆ పార్టీ నేతలు చేసిన విమర్శలకు ఆన్సర్ ఇచ్చేసింది కూటమి సర్కార్. ట్రోలింగ్స్‌కు, అపోజిషన్ అటాక్‌కు అసలు సిసలు సమాధానం స్కీమ్ అమలుతోనే ఇచ్చినట్లు అయింది.అయితే సంక్షేమ పథకాలను చంద్రబాబు అమలు చేయరు, ఆయనకు ఆ ట్రాక్ రికార్డు అన్నది లేదంటూ విపక్ష వైసీపీ పదే పదే చేసిన విమర్శలకు సరైన బదులునే చంద్రబాబు ఇచ్చారని అంటున్నారు. దేశంలోనే ఎక్కడా ఎవరూ చేయని విధంగా ఆ మాటకు వస్తే టీడీపీ చరిత్రనే తిరగరాసేలా పెద్ద పెద్ద స్కీమ్‌లను ఇంప్లిమెంట్ చేసి చూపిస్తున్నారని అంటున్నారుమామూలుగా అయితే అధికార పక్షం హామీలు అమలు చేయకపోతేనే అపోజిషన్‌కు అస్త్రంగా మారే అవకాశం ఉంటుంది. అలా చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తమకు ఈజీగా దొరికిపోతారనుకున్న వైసీపీకి ఒక్కో స్కీమ్ ఇంప్లిమెంట్‌తో ఝలక్ ఇస్తున్నారు చంద్రబాబు. అభివృద్ధికే బాబు అంబాసిడర్ అని అనుకునే వారికి సంక్షేమానికి కూడా తాను అసలైన చిరునామా అని అనిపించుకుంటున్నారన్న చర్చ జరుగుతోంది. ప్రతిపక్షానికి ఎజెండా లేకుండా.. అస్త్రాలన్నింటినీ లాగేసుకుంటున్నారు చంద్రబాబు. దీంతో వైసీపీ కూడా రూట్ మార్చిందంటున్న చర్చ జరుగుతోంది. ప్రభుత్వం పథకాలు ఇవ్వడం లేదన్న విమర్శల కంటే..తమ నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారని.. రాజకీయంగా వేధిస్తున్నారని.. రాష్ట్రంలో శాంతి భద్రతలు లేకుండా పోయాయని వైసీపీ కొత్త రాగం అందుకుందన్న టాక్ వినిపిస్తోంది.తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ స్కీమ్‌ల అమలుతో కూటమి సర్కార్‌పై పాజిటివ్ టాక్ పెరుగుతుందనే చెప్పొచ్చు. అసలు ఇవ్వరన్న ప్రచారం నుంచి ఇస్తారన్న ప్రచారం దాకా..ఇచ్చేవరకు తీసుకొచ్చిన పథకాలు..ప్రతీ ఇంటికి చేరుతు న్నాయంటున్నారు. దీంతో వైసీపీ మరో దారిలో కూటమిని పబ్లిక్‌లో నెగెటివ్ చేసే స్కెచ్ వేసిందన్న టాక్ నడుస్తోంది.అయితే చంద్రబాబు మాత్రం సంక్షేమానికి ఇస్తున్న ప్రయారిటీ చూస్తుంటే.. ఇదో పెద్ద ప్లానే వేశారన్న చర్చ అయితే నడుస్తోంది. స్కీమ్‌ల విషయంలో జనం నుంచి వ్యతిరేకత రాకముందే ఓ పథకాన్ని అమలు చేసుకుంటూ పోతున్నారు. ఇక చంద్రబాబుకు ఆల్రెడీ అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ అన్న పేరు ఉండే ఉంది. అటు అభివృద్ధి, అటు సంక్షేమం రెండూ బ్యాలెన్స్ చేస్తుండటంతో.. ఇప్పుడున్న పరిస్థితుల్లో కూటమి హవాకు ఢోకా ఉండకపోవచ్చన్న టాక్ వినిపిస్తోంది. అయితే వైసీపీ మాత్రం స్కీమ్‌ల ఇంప్లిమెంట్‌లో లూప్‌హోల్స్ వెతికే పనిలో పడింది.

# తల్లి కాంగ్రెస్‌తో పిల్ల కాంగ్రెస్ చేతులు...




**కడప- సూర్యా వాస్తవం:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్‌కు దగ్గరవుతోందా? ఆ పార్టీకి మద్దతు తెలుపుతుందా? రాహుల్ గాంధీకి మద్దతుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో ప్రచారం చేయడం దేనికి సంకేతం? ఇప్పుడు పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. కాంగ్రెస్ పార్టీని విభేదించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు ఆ పార్టీకి దూరంగా ఉంటూ వచ్చారు. అదే సమయంలో సిద్ధాంత పరంగా వ్యతిరేకం అయిన బిజెపితో సన్నిహిత సంబంధాలు కొనసాగించారు. అయితే ఇప్పుడు రాహుల్ గాంధీతో జతకలవాల్సిన అనివార్య పరిస్థితి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఏర్పడింది.2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకూటమి ఘనవిజయం సాధించింది. వై నాట్ 175 అన్న నినాదంతో బరిలో దిగిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి షాక్ తప్పలేదు. కేవలం 11 సీట్లకే ఆ పార్టీ పరిమితం అయ్యింది. అయితే టిడిపి ఇంతటి ఘన విజయానికి కారణం ఈవీఎం లేనని వైసిపి అనుమానిస్తోంది. దీనిపై గట్టి పోరాటమే చేస్తోంది. ప్రత్యేకంగా డిపాజిట్లు కట్టిమరి విచారణ కోరుతోంది. ఒకటి రెండుసార్లు ఎన్నికల కమిషన్ ముందు కూడా హాజరైంది. ఈవీఎంలపై అనుమానాలు, పోలింగ్ నాడు సాయంత్రం వరకు ఓటర్లు బారులు తీరడం వంటి వాటిని ఈసీ కి ఫిర్యాదు చేసింది.


మాజీ మంత్రి రోజా లాంటి వారైతే ఈవీఎంల వైపే తరచూ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. టిడిపి కూటమి విజయాన్ని.. ఈవీఎంల విజయంగా అభివర్ణిస్తున్నారు. అయితే జాతీయ స్థాయిలో ఇప్పుడు ఇదే అంశంపై గళం ఎత్తు తున్నారు కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీఎలక్షన్ కమిషన్ సరైన చర్యలు తీసుకోవడం లేదని.. తన అనుమానాలు అలాగే ఉన్నాయని చెబుతున్నారు. దేశవ్యాప్తంగా కొత్త ఓటర్ల చేరిక వెనుక కుట్ర కోణం ఉందని మండిపడుతున్నారు. ఇదంతా నిరూపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఎన్నికల నిర్వహణ తీరు బాగాలేదని ఉదహరిస్తూ చెబుతున్నారు రాహుల్ గాంధీ. 2024 సార్వత్రిక ఎన్నికల్లో చాలా రకాల తప్పిదాలు జరిగాయని.. అనేక రకాల అనుమానాలు ఉన్నాయని చెబుతున్నారు రాహుల్. అయితే సార్వత్రిక ఎన్నికలతో పాటు ఏపీ అసెంబ్లీ ఎన్నికలు కూడా జరిగాయి.

తద్వారా ఏపీలో సైతం అక్రమాలు జరిగినట్లు రాహుల్ గాంధీ ఆరోపించినట్లు అయింది. దీంతో వైసిపి సోషల్ మీడియా యాక్టివిస్టులు రాహుల్ గాంధీని సమర్థిస్తూ పోస్టులు పెడుతున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి వైసిపి దగ్గరవుతుందా అన్న అనుమానాలు కూడా పెరుగుతున్నాయి.అయితే ప్రస్తుతం ఏపీలో ఎన్డీఏకూటమి బలంగా ఉంది. కానీ ఇండియా కూటమికి కనీస ప్రాతినిధ్యం లేదు ఏపీలో. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏ కూటమిలో కూడా లేదు. ఒక విధంగా చెప్పాలంటే తటస్థ వైఖరితోనే ఉన్నారు. జాతీయస్థాయిలో రెండు కూటమిలతో సంబంధం లేకుండా.. టిడిపి తో పాటు జనసేన ను మాత్రమే ప్రత్యర్థిగా భావిస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. బిజెపిపై ఆగ్రహం వ్యక్తం చేయడం లేదు. దానికి కారణం తనపై ఉన్న కేసులే. ఒకవేళ జగన్ మోహన్ రెడ్డి కాంగ్రెస్ కు స్నేహ హస్తం అందిస్తే.. కచ్చితంగా ఆయనకు ఇబ్బందికరమే. అందుకే ఆయన రాహుల్ గాంధీతో చేతులు కలిపే ఛాన్స్ లేదని తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# జయంతిపురంలో మిస్సైల్ కేంద్రం...




**విజయవాడ - సూర్యా వాస్తవం:** ఆంధ్రప్రదేశ్‌లోని జగ్గయ్యపేట నియోజకవర్గంలో రక్షణ పరిశ్రమల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. బ్రహ్మోస్ క్షిపణుల తయారీ యూనిట్‌తో పాటు మరికొన్ని రక్షణ రంగ సంస్థలు ఇక్కడ తమ యూనిట్లను నెల కొల్పనున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రానికి లేఖ రాయడంతో డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటుకు శర వేగంగా అడుగులు పడుతున్నాయి. జయంతిపురం, పెద్దవరంలో ఇందుకోసం వందల ఎకరాల భూమి అందుబాటులో ఉంది. దీనివల్ల ఈ ప్రాంతానికి దేశీయంగా గుర్తింపు రావడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా మెరుగు పడతాయని అంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని జగ్గయ్యపేట నియోజకవర్గం రూపు రేఖలు మారబోతున్నాయి. ఈ ప్రాంత ప్రజలకు భారీ ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఎలా అంటే జగ్గయ్యపేట నియోజకవర్గంలో రక్షణ పరిశ్రమల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. బ్రహ్మోస్ క్షిపణుల తయారీ సంస్థ ప్రతినిధులు తాజాగా ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. త్వరలో ఇక్కడ తమ యూనిట్‌ను నెలకొల్పే దిశగా అడుగులు ముందుకు వేస్తున్నారు. బ్రహ్మోస్‌తో పాటుగా మరికొన్ని కేంద్ర ప్రభుత్వ రక్షణ





రంగ సంస్థలు కూడా ఇక్కడ తమ యూనిట్లను ఏర్పాటు చేయనున్నాయి. దీనికి సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు 2025 మే 19న కేంద్రానికి లేఖ రాశారు. జగ్గయ్యపేటలో మిసైల్స్, ఆయుధ తయారీ పరిశ్రమలను నెలకొల్పాలని ఆయన లేఖలో కోరారు.ఈక్రమంలోనే జగ్గయ్యపేటలో డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటుకు శరవేగంగా అడుగులు పడుతున్నాయి. బ్రహ్మోస్ ఏరోస్పేస్ డిఫెన్స్ కార్పొరేషన్ సీఎండీ ఆధ్వర్యంలోని బృందం ఈ ప్రాంతాన్ని ఇప్పటికే రెండుసార్లు సందర్శించా.. యూనిట్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించింది. దీంతో త్వరలోనే ఇక్కడ బ్రహ్మోస్ క్షిపణుల తయారీ యూనిట్ ఏర్పాటు కానుందని తెలుస్తోంది.జగ్గయ్యపేట ప్రాంతం విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారికి దగ్గరగా ఉండటం వల్ల ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా ఉందని అంటున్నారు. పైగా ఈ ప్రాంతానికి రైలు, విమాన, రహదారి మార్గాలు అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్ నుండి కొన్ని గంటల్లోని ఇక్కడకు చేరుకోవచ్చు. పైగా ఈ ప్రాంతంలో ప్రభుత్వ, ఏపీఐఐసీ భూములు వేల ఎకరాల్లో ఖాళీగా ఉన్నాయి. అందుకే డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటుకు ఇది అనువైన ప్రదేశమని అంటున్నారు. ఈక్రమంలో కొన్ని రోజుల క్రితం టీడీపీ ఎంపీల బృందం కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి.. రాష్ట్రంలో రక్షణ రంగ పరిశ్రమల ఏర్పాటును వేగవంతం చేయాలని కోరింది.బ్రహ్మోస్ క్షిపణి తయారీ యూనిట్ కోసం జగ్గయ్యపేట పరిధిలోని జయంతిపురంలో 800 ఎకరాలు, పెద్దవరంలో 1200 ఎకరాలు అందుబాటులో ఉన్నాయి. ఈ భూముల్లో రక్షణ రంగ పరిశ్రమలను ఏర్పాటు చేయనున్నారు. బ్రహ్మోస్ క్షిపణి తయారీ సంస్థ ఇక్కడ ఏర్పాటైతే, జగ్గయ్యపేటకు దేశీయంగా ప్రత్యేక గుర్తింపు వస్తుంది అంటున్నారు.

# నాన్నా క్షమించండి...

- చదవలేక పోతున్నా..
- అమ్మ దగ్గరికి వెళ్లిపోతున్నా..
- ఉరి వేసుకుని బిటెక్ విద్యార్థిని ఆత్మహత్య...







**మదనపల్లె – సూర్య వాస్తవం, ఆగస్టు 06 :** నాన్నా.. అక్క.. నన్ను క్షమించండి... మీరు అనుకున్నంత స్థాయిలో చదవలేక పోతున్నా అందుకే అమ్మ దగ్గరికి వెళ్లిపోతున్నా అంటూ బిటెక్ విద్యార్థిని సూసైడ్ నోటు రాసి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన బుధవారం మదనపల్లె పట్టణంలో వెలుగు చూసింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె రామారావు కాలనీకి చెందిన సుధాకర్ రెడ్డి, సుగుణ దంపతులకు ముగ్గురు కుమార్తెలు అశ్విని, ప్రసన్న, రెడ్డి శ్రావణిలు ఉన్నారు.

సుగుణ మూడేళ్ల క్రితం చనిపోవడంతో తండ్రి సుధాకర్ రెడ్డి అన్నీ తానై చేనేత మగ్గాల పని చేసుకుంటూ ముగ్గురు ఆడపిల్లల్ని పోషించు కుంటున్నాడు. ఈ క్రమంలో పెద్ద కుమార్తె అశ్వినికి వివాహం చేశాడు. రెండవ కుమార్తె ప్రసన్న డిగ్రీ వరకు చదివి ఇంటి పట్టునే ఉంటోంది. మూడో కుమార్తె రెడ్డి శ్రావణి(19) పులివెందుల జెఎన్టీయూ కళాశాలలో బిటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. కాగా శ్రావణిని పండుగ కోసం సుధాకర్ రెడ్డి మూడు రోజుల క్రితం కళాశాల వెళ్లి ఇంటికి తీసుకొచ్చాడు. ఈ క్రమంలో చదువు ఒత్తిడిని భరించలేని రెడ్డి శ్రావణి తనపై నాన్న, అక్క పెట్టుకున్న నమ్మకాన్ని ఒమ్ము చేస్తానేమోనని తనలో తానే కుంగిపోయి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు సూసైడ్ నోట్ రాసి 4 వ తేదీ రాత్రి ఓసారి ఆత్మహత్యా యత్నానికి పాల్పడి విరమించుకుంది. అయినా తనలో చనిపోవాలని ఆలోచన పెరిగిపోవడంతో 5వ తేదీ మంగళ వారం అర్ధరాత్రి నాన్న, అక్క గాఢ నిద్రలో ఉన్న సమయంలో తన గదిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేదుకుంది. ఉదయాన్నే నిద్ర లేచిన తండ్రి సుధాకర్ రెడ్డి కుమార్తె ఉరికి వేలాడు తుండటాన్ని చూసి కుప్పకూలిపోయాడు. గట్టిగా కేకలు వేస్తూ, మరో కుమార్తె ప్రసన్న తో కలిసి ఆర్తనాదాలు చేశారు. స్థానికులు గుమికూడి ఎంతపని చేశావు శ్రావణి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న రెండో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి మృతురాలు రాసిన సూసైడ్ నోట్ ను స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి లోని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పుట్టపర్తి మార్కెట్ యార్డ్
# వైస్ చైర్మన్‌గా ప్రేమనాథ రెడ్డి



**శ్రీ సత్యసాయి బ్యూరో – సూర్య వాస్తవం, ఆగస్టు 06:** శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్‌గా నల్లమడ మండలం ములప్పగారిపల్లికి చెందిన సోమ గట్టు ప్రేమనాథరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులను జారీ చేసింది. ప్రేమనాథరెడ్డి గత 20 సంవత్స రాలుగా తెలుగుదేశం పార్టీలో చురుకైన కార్యకర్తగా పనిచేస్తూ పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డికి ప్రియ శిష్యుడుగా ఉంటూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లి నిరంతరం పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నాడు. ప్రేమనాథరెడ్డి తండ్రి సోమగట్టు ప్రతాపరెడ్డి కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా ఉంటూ గతంలో శ్రీమత్ ఖాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ గా కూడా పనిచేశారు. మాజీ మంత్రివర్యులు ప్రస్తుత టిడిపి సీనియర్ నాయకులు జెసి దివాకర్ రెడ్డి బ్రదర్స్ కు సోమగట్టు ప్రతాపరెడ్డి కుటుంబ సభ్యులకు మధ్య మంచి అవినాభావ సంబంధాలు ఉన్నాయి. తాను తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం చేస్తున్న కృషిని గుర్తించి తనకు ఈ పదవిని ఇవ్వడం చాలా సంతోషకరంగా ఉందని ప్రేమనాథరెడ్డి అభిప్రాయపడ్డారు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యువనేత మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అడుగుజాడల్లో సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తానాని ఆయన పేర్కొన్నారు. తనకు పదవి రావడానికి కృషిచేసిన మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డికి పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి మరి ఇతర నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కూటమి ప్రభుత్వంతోనే
# సామాజిక న్యాయం సాధ్యం

- చేనేతలకు అండగా సీఎం చంద్రబాబు
- నేటి నుంచి నేతన్నకు ఉచిత విద్యుత్ పథకం అమలు
- 125 కోట్లతో 50 వేగ మగ్గాలు.. 50 వేల మరమగ్గాలకు లబ్ది
- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ నాయకుడు గాజుల ఖాదర్‌బాషా



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం, ఆగస్టు 06:** 2024 సార్వత్రిక ఎన్నికల హామీ మేరకు, చేనేతల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని, ఏ.పీ సర్కార్ ఆగస్టు 7 నుంచి ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయనున్న దరిమిలా గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషికి దర్పణమని గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు.... బుధవారం నాడు గాజుల ఖాదర్ బాషా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశ్వసనీయతకు నిలువెత్తు నిదర్శనం అన్నారు. ఇప్పటికే చేనేతల అభ్యున్నతికి పాటు పడుతున్న కూటమి ప్రభుత్వం.., నేటి నుంచి ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు పరచి.., నేతన్నలకు దన్నుగా నిలవనుందని చెప్పారు. అంతేకాకుండా మగ్గాలకు 200 యూనిట్లు. మరమగ్గాలకు 500 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ ను అందించి వారి జీవితాలలో వెలుగులు చంద్రబాబు నాయుడు నింపుతు న్నారని తెలియజేశారు. 125 కోట్ల రూపాయలు వెచ్చించి, ఉన్నత ఆశయంతో అమలు పరస్తున్న ఈ పథకం ద్వారా 50 వేగ మగ్గాలు..,15 వేల మర మగ్గాల వారికి లబ్ది చేకూర్చనుందని గాజుల ఖాదర్బాషా వివరించారు. ఆంధ్రప్రదేశ్ లో నిరుపేద లేని సమాజ స్థాపనే లక్ష్యంగా ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాత్రింపగళ్లు నిరంతర శ్రామికునిగా కష్టపడుతున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి ఆలోచనల నుంచి ఉద్భవించిన పి4 పథకానికి అత్యంత ఆదరణ లభిస్తుందన్నారు. ఈ పథకానికి సంబంధించి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపుకు స్పందించి పలువురు ముందుకు రావడం ..,పి4 పథకం సామాజిక కోణాన్ని తెలియజేస్తోందని ప్రజలు ప్రశంసలందు కుంటో దన్నారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు శివారెడ్డి, గంగాధర్ రెడ్డి కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీవెంకటేశ్వర స్వామి కుంభాభిషేకం



**పెళ్లకూరు – సూర్యా వాస్తవం, ఆగస్టు 06:** పెళ్లకూరు మండలంలోని రోశనూరు దళితవాడలో నూతనంగా నిర్మించిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం అంగ,రంగ వైభవంగా కుంబాభిషేకం మహెూత్సవం నిర్వహించారు. కుంభాభిషేక మహెూత్సవంలో పాల్గొన్న సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయ శ్రీ, పార్థసారథి దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా రోసనూరు టిడిపి నేత దొమ్మరాజు సత్యంరాజు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయ శ్రీ,పార్థసారథి దంపతులకు శాలువాలు కప్పి,సన్మానించి,పట్టు వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ కోసం
# రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి




**నాయుడుపేట– సూర్యా వాస్తవం, ఆగస్టు 06:** అన్నదాత సుఖీభవ పథకంలో నగదు జమకాని రైతులు తమ పేర్లను ఆధార్ నంబర్ సీడింగ్ చేసుకోవాలని నాయుడుపేట మండలం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం నాగార్జున సాగర్ తెలియజేశారు. బుధవారం నాయుడుపేట మండలం లోని కాపులూరు కూచివాడ గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జాయింట్ ఎల్పీఎంలను తొలగించుకుని వ్యవసాయ సహాయకులను కలిసి రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. నాయుడుపేట మండల వ్యవసాయ అధికారి జోగి గణేష్ మాట్లాడుతూ కె ఎన్ ఎం 1688, ఎంటిఓ 1010 రకాల వరి సాగులో కాండం ఎండు తెగులు ఉదృతంగా ఉందన్నారు. దానిని నివారించేందుకు వాలిడా మైసిన్ పురుగుమందును ఒక లీటరు నీటిలో 2.5 మిల్లీ లీటర్లను కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విఏఎలు చెంగల్ రాజు, భావన పలువురు రైతులు పాల్గొన్నారు.



# ఘనంగా సీపీఐ మహాసభలు



**గుత్తి– సూర్య వాస్తవం, ఆగస్టు 6**
గుత్తి పట్టణంలో ఆర్ఎంబి బంగ్లా నుండి నిజామీ ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఈ కా ర్యక్రమానికి సిపిఐ పట్టణ కార్యదర్శి రాజు అధ్యక్షతన ముఖ్య అతిథులుగా విచ్చేసిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీర భద్ర స్వామి, సహాయ కార్య దర్శి రమేష్,మాట్లాడుతూ భారత దేశ స్వతంత్రం కోసం నిరంతరం కష్టపడిన కష్టపడి ప్రాణ త్యాగాలు కూడా లెక్క చేయకుండా పోరాడిన ప్రతి సిపిఐ ఈనాడు అనేక రాజకీయ పార్టీలు పుట్టుకొస్తున్నాయి. అయినా భారత కమ్యూనిస్టు పార్టీకు ఇవన్నీ తగ్గటం లేదు అనేక ఉద్య మాలు చేస్తూనే ఉన్నది ప్రతి ఉద్యమం వెనక సిపిఐ ప్రజా సంఘాల పాత్ర కీలకం వహి స్తున్నది అలాంటి పార్టీ మహా సభలు మనము ఘనంగా ని ర్వహించు కున్నందుకు సంతో షంగా ఉన్నదని మరియు పేదలకు పన్నుల విద్యుత్ భారాలు పడకుండా చూడాలని సిపిఐ పార్టీ అనేకమార్లు కేం ద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలి యజేసిన గత రాష్ట్ర వైఎ స్సార్ ప్రభుత్వం కేంద్రానికి ఆదానికి తలవంచి విద్యుత్ ఒప్పందాలు చేసుకుంది నే డు టిడిపి ప్రభుత్వం ఎన్ డి ఏ ఫోటో ప్రభుత్వం అమలు పరుస్తుంది ఈ విద్యుత్ స్మా ర్ట్ మీటర్లు వల్ల 25 సంవత్స ర కాలంలో రాష్ట్ర ప్రజలపై ల క్ష పదివేల కోట్లు పెనభారం మోపుతోంది అందులో ఒక సంవత్సరానికి 17845 కో ట్లు కోట్లు వసూలు చేసింది ఇలా సర్చార్జీలని మొదలగు పన్నులు ప్రజలపై పెనుభారం మోపుతోంది. దీన్ని సిపిఐగా ఖండిస్తున్నాం ఈసమస్య ను క్షేత్రస్థాయి కూడా తీసుకు వెళ్తామని కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలకు హెచ్చరిక చేస్తు న్నాం మరోపక్క బిఫోర్ అనే విధానాన్ని తీసుకొచ్చి కొన్ని కుటుంబాలు అధికారులు ప్ర జాప్రతినిధులు దత్తకు తీసు కుంటున్నామని పత్రికల్లో వ స్తున్నాయి మేము పిఫోర్ కు వ్యతిరేకులం కామ్ ఆంధ్రప్ర దేశ్లో అనాథలు వేలాదిమం ది ఉన్నారు. మీరు రైల్వే స్టేష న్ లోనూ బస్టాండ్ దగ్గర బి క్షం ఎత్తుకునే పరిస్థితి రాకుం డా పి4లో పొందవరిస్తే చా లా సంతోషం మరియు గుత్తి పట్టణంలో ఇళ్ల స్థలాల కోసం వేలాది అర్జీలు ఇచ్చిన నేటికీ పరిష్కారం కాలేదు వీటిని వెంటనే పరిష్కారం చేయక పోతే సిపిఐ పట్టణ పార్టీ ఆ ధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉ ద్యమాలు చేసి ప్రజలకు మే మే సిపిఐ పార్టీగా ఇళ్ల స్థలా లు పంచుతామని గుత్తి అధి కారులకు హెచ్చరిక చేస్తు న్నాం మరోపక్క రైతులను ఆదుకుంటున్నామని రైతు సుఖీభవ కింద 7000 వారి అకౌంట్లో వేస్తున్నారు రైతులు బిక్షగాళ్లు కాదు వారికి పంట పండించే దానికి ప్రతి ఎకరా కు సాగునీరు విత్తనాలు ఎ రువులు పనిముట్లు 90% సబ్సిడీతో ఇచ్చి ఆదుకుంటే రైతులకు న్యాయం చేసినట్లు ఉంటుంది ఈ వేలవల్ల ఒరిగే ది ఏమీ లేదని తెలియజేస్తు న్నాం గతంలో సిపిఐ గుంటక ల్ పట్టణ పార్టీ ఆధ్వర్యంలో ఆంద్రీనీవా నీరు నియోజకవ ర్గానికి ఇవ్వాలని రెండు సం వత్సరాల పోరాటాలు నడిపి అనంతరం ఆమరణ నిరాహా ర దీక్షకు గునుకోవడం వల్ల ప్రభుత్వం దిగివచ్చి గుత్తి వై టీ చెరువు పాతుకొచ్చేరువు కు అధికారికంగా 0.06 టీ ఎంసీల నీరును ఇవ్వాలని అధికారుల నుండి ఉత్తర్వు లు వచ్చాయి దీని అమలుప రిచే దాంట్లో గుంటకల్ ని యోజకవర్గ ఎమ్మెల్యే సంబం ధిత అధికారులు కూడా విఫ లమయ్యారని తెలపడం జరిగింది గుంటకల్ నియోజ కవర్గంలో మూడు చెరువు లకు సంపూర్ణమైన నీటి కోటాను కేటాయించాలని సిపిఐ పార్టీగా డిమాండ్ చేశాం ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శిగా రాజు సహాయ కార్యదర్శిలు గా మముద నజీర్ 9 మంది కమిటీ సభ్యులు మరియు రూరల్ కార్యదర్శిగా రాందాసు 11 మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## సకాలంలో మున్సిపల్ దుకాణాల అద్దె బకాయిలుచెల్లించాలి



**నాయుడుపేట- సూర్య వాస్తవం, ఆగస్టు 06:** నాయుడుపేట పట్టణంలోని మున్సిపల్ దుకాణల అద్దె బకాయిలను తక్షణమే చెల్లించాలని మున్సిపల్ మేనేజర్ ఎం.ఉరుకుందమ్మ కోరారు. బుధవారం కమీషనర్ ఫజులుల్లా ఆదేశాల మేరకు పట్ట ణంలోని బకాయి ఉన్న మున్సిపల్ దుకాణాలను ఆమె సంద`ర్శించారు.

ఈ సందర్భంగా ఆమె దుకాణ లీజుదారులతో బకాయిల చెల్లింపుపై చర్చించారు. ఒక నెల బకాయి ఉంటే తాము ఒత్తిడి తీసుకురామని,నెలల పాటు అద్దె పెండింగ్ ఉంటే ఏలా అని ప్రశ్నించారు.వారం లోపు బకాయి ఉన్న అద్దెలు చెల్లించాలని, లేనిపక్షంలో దుకాణలకు తాళాలు వేస్తామని ఆమె హెచ్చరించారు. మేనేజర్ వెంట బిల్ కలెక్టర్లు గాయిత్రి, ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

## పని అనుభవంలో ఛాత్రోపాధ్యాయులు

**- కళాత్మక విద్యకు నూతన దశ.**
**- బోధనలో కొత్తదనం, సృజనాత్మకత,**
**- డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి వెల్లడి**





**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, ఆగస్టు 6:** ఛాత్రోపాధ్యాయులు తమ పని అనుభవాన్ని ఆధారంగా చేసుకుని రూపొం దించిన బోధనోపకరణాలు, కళాత్మక వస్తువులు బోధనలో నూత నత్వానికి దోహదం చేస్తున్నాయని డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి అన్నారు. బుధవారం ఉదయం డైట్ ఆవరణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనలో ఛాత్రోపాధ్యాయుల చేతుల్లో రూపుదిద్దుకున్న వివిధ రకాల బోధనో పకరణాలు, అలంకరణ సామగ్రిని ప్రదర్శించారు.ఈ సందర్భంగా మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ చాత్రోపాధ్యాయులు తమ పని అనుభవాన్ని కళాత్మక విద్యతో మిళితం చేసి రూపొందించిన ఈ వస్తువులు విద్యార్థుల బోధనలో కొత్తదనాన్ని తీసుకురావడమే కాకుండా, కఠినమైన పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునేలా చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. విద్యార్థుల్లో పాఠాల పట్ల ఆసక్తి కలిగించేందుకు, బోధనను జీవితాంతం గుర్తుండేలా చేసేందుకు ఉపాధ్యాయులు సృజనాత్మకతతో కూడిన పద్ధతులను ఉపయోగించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఉపాధ్యాయ శిక్షణలో భాగంగా మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంటున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు శివ భాస్కర్, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

## తల్లిపాల వారోత్సవాలు



**కృష్ణ సముద్రం-సూర్యాస్తవం, ఆగస్టు 6:**
కృష్ణసముద్రం సచివాలయంలోని ఎగువ కృష్ణ సముద్రం అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం జరిగినది.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ఎం అనిత మాట్లాడుతూగర్భవతులకు బాలింతలకు తల్లిపాల యొక్కఆవశ్యకత గురించివివరించడం జరిగినది.బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి పాలు పట్టించాలని,ముర్రుపాలలో,వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని.బిడ్డకు ఆరు నెలల వరకుకేవలం తల్లిపాలు మాత్రమే పట్టించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారుహెల్త్ అసిస్టెంట్ పెన్ మల్లీశ్వరి,అంగన్వాడి వర్కర్ శాంతి దేశమ్మఆశ వర్కర్ రాణి పాల్గొన్నారు.

# డిజిటల్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**- మీ భద్రత మీ చేతుల్లోనే ఉంది**
**- ఎలాంటి అనుమానాస్పద లింకులు వచ్చినా క్లిక్ చేయకండి**
**- జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు**



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, ఆగస్టు 06:** ఇటీవల కాలంలో టెక్నాలజీ ఎంత వేగంగా అభివృద్ధి చెందు తుందో, అదే వేగంతో సైబర్ నేరాలు కూడా పెరుగు తున్నాయని, బ్యాంక్ మోసాలు, సోషల్ మీడియా మోసాలు, ఫేక్ లింకులు, యూపీఐ మోసాలు మొదలైనవి సామాన్య ప్రజలను లక్ష్యంగా చేసుకుంటూ సైబర్ నేరగాళ ్ళ మోసాలకు పాల్పడుతున్నారని అన్నమయ్య జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఐపియస్,. జిల్లా ప్రజలకు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఇటువంటి మోసాలను ప్రజలు ఎలా నివారించాలో కొన్ని సూచనలు చేశారు.

- మీ ఓటీపీలు, బ్యాంక్ వివరాలు ఎవరికీ చెప్పవద్దు.
- అనుమానాస్పద లింకులు క్లిక్ చేయవద్దు.
- ఫోన్‌కి వచ్చిన అజ్ఞాత వ్యక్తుల మెసేజ్‌లు, కాల్స్‌కు స్పందించవద్దు.
- సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోకండి.
- మీ ఫోన్లో ఫేక్ యాప్స్ ఇన్‌స్టాల్ చేయవద్దు.
- సైబర్ మోసానికి గురైతే వెంటనే సైబర్ హెల్ప్ లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలి.
- ఆన్లైన్ ఫిర్యాదుకు www.cybercrime.gov.inకు ఫిర్యాదు చేయాలి.
- మీ దగ్గర పోలీస్ స్టేషన్ లేదా సైబర్ సెల్ పోలీసులకు కూడా ఫిర్యాదు చేయండి.

అని జిల్లా ప్రజలకు జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ప్రజలు సాంకేతిక పరిజ్ఞానాన్ని జాగ్రత్తగా ఉపయోగించాలని , డిజిటల్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని మీ భద్రత మీ చేతిలోనే ఉంటుందని ఎలాంటి అనుమానాస్పద లింకులు వచ్చినా క్లిక్ చేయకుండా ఉండాలని, అనుమానం వచ్చిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా సైబర్ సెల్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు విజ్ఞప్తి చేశారు. ప్రజలను డిజిటల్ అరెస్ట్ అని సైబర్ నేరగాళ్ళు మోసాలకు గురి చేయడానికి ప్రయత్నించినట్లయితే ఆ పరిస్థితులలో ప్రజలు సైబర్ సెల్ పోలీసులను ఆశ్రయించాలని, ముందు జాగ్రత్త చర్యలతో అటువంటి నేరాల పట్ల అప్రమత్తంగా ఉండి అవగాహన పొందాలని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు తెలిపారు.

# నిధులు వెల్లువ అంతా రాజధాని అమరావతికేనా?

**- అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయ భవనాలకు నిధులు మంజూరుకు కూటమి ప్రభుత్వానికి మనస్సు రాదా?**
**- వెనుకబడిన రాయచోటికి జిల్లా కేంద్రం హోదా మిగల్చరా!**
**- వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం**
**- రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి**



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, ఆగస్టు 06:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధ్యాస, శ్వాస అంతా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులు మళ్ళింపు కేవలం రాష్ట్ర రాజధాని అమరావతికేనా? అన్న మయ్య జిల్లా లాంటి నూతన జిల్లాల కలెక్టర్ కార్యాలయ సముదాయ భవనాలకు నిధులు మంజూరుకు మనస్సు రాదా అని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి బుధవారం ఒక పత్రిక ప్రకటన ద్వారా ప్రశ్నించారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ అభివృద్ధికే మాత్రమే రాష్ట్ర బడ్జెట్ అంతా కేటాయించి, పాలనలో తెలంగాణ ప్రజల భాగస్వామ్యం తగ్గించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు దోహద పడిన విషయాన్ని మరిచి పోకూడదని గుర్తు చేశారు.నేడు మిడియా ద్వారా విస్తృతంగా ప్రచారం జరుగుతున్నట్లు వెనుకబడిన రాయచోటికి జిల్లా కేంద్రం హెూదా మిగుల్చతారా! లేదా? అనే అంశాన్ని సమాధానంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం సముదాయ భవనాలకు నిధులు మంజూరు చేయడంతో ప్రజలలోని అనుమానాలను, అపోహలను పటాపంచలు చేయగలరని ఆయన తెలిపారు.

అలా కాకుండా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం, వివక్షతలను ప్రదర్శించితే మరోసారి గ్రేటర్ రాయలసీమ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఉద్యమానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కారణం అవుతుందని ఆయన తెలిపారు.గ్రేటర్ రాయలసీమ ప్రాంతంలోని ఉమ్మడి జిల్లాలైన కడప,కర్నూలు, ప్రకాశం, నెల్లూరు , చిత్తూరు, అనంతపురం చెందిన ప్రజలు గ్రేటర్ రాయలసీమ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు విధానమే నినాదంగా ఉద్యమించడమే శరణ్యమని,తక్షణ కర్తవ్యంగా భావించి కదిలే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆయన తెలిపారు.

### ఆంధ్ర ఊటీ హార్సిలీ హిల్స్‌లో పలు సుందరీకరణ

# పనులను ప్రారంభించిన జిల్లా కలెక్టర్

**- మద్యం, మత్తు పదార్థాలు సేవించి, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసినా, పర్యాటకులకు ఇబ్బంది పెట్టిన కఠిన చర్యలు తప్పవు**



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, ఆగస్టు 6:** ఆంధ్ర ఊటీ హార్సిలీ హిల్స్ లో పలు సుందరీకరణ పనులను చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. బుధవారం బి.కొత్తకోట పరిధిలోని ఆంధ్ర ఊటీ గా పిలువబడి ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీ హిల్స్ లో పలు సుందరీకరణ పనులలో భాగంగా వెల్కమ్ టు హార్సిలీ హిల్స్ బోర్డును, హరిత హెూటల్ ఎదురుగా ఉన్నటువంటి కూడలిలో వాటర్ ఫౌంటెన్ ను, రెవెన్యూ శాఖ సహకారంతో హెూటల్ బ్రీజోరా కలెక్టర్ ప్రారంభో త్సవం చేసి వినాయక స్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘా స్వరూప్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీ హిల్స్ లోని ప్రధాన కూడళ్లలోనిపలు సుందరీకరణ చేసిన పనులను పరిశీలించారు. హార్సిలీ హిల్స్ లో పర్యాటకులను ఆకర్షించేందుకు వివిధ రకాల అభివృద్ధి పనులను చేపట్టడం జరుగు తోందన్నారు. హార్సిలీ హిల్స్ పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య పనులకు సంబంధించి ఏజెన్సీల ద్వారా కొత్తగా పారిశుద్ధ్య కార్మికులను త్వరలో ఏర్పాటు చేసే విధంగా చూస్తామన్నారు.

పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సెక్యూరిటీ గార్డులను నియమించడం జరుగుతుందని, అలాగే పర్యాటక కేంద్రంలో మద్యం, మత్తు పదార్థాలు సేవించి, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం పర్యాట కులకు ఇబ్బందులు కలగచేస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. పర్యాటకులకు భద్రత కల్పించే విధంగా అన్ని చర్యలు తీసుకుం టామన్నారు. పర్యాటకుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తామన్నారు. ఈ పర్యటనలో గాలి బండ వద్ద ఏర్పాటుచేసిన ఐ లవ్ యు హార్స్లీ హిల్స్ బోర్డు ఏర్పా టును, హార్స్లీ హిల్స్‌లో ఏర్పాటుచేసిన స్థూపాన్ని ఆధునీ కరణ పనులను, జిడ్డు కృష్ణమూర్తి కూడలి, వివేకానంద విగ్రహాలకు ఏర్పాటు చేసిన గ్రిల్స్‌ను పరిశీ లించారు. అనంతరం అధికారులకు పర్యాటకులను ఆకర్షించేందుకు, పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేసేందుకు అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు తాసిల్దార్ భావజాన్, ఎంపీడీవో కృష్ణవేణి, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.






# పవర్ బ్రోకర్‌గా వెంకటేష్ నాయుడు



**తిరుపతి- సూర్య వాస్తవం:** వెంకటేష్ నాయుడు మామూలోడు కాదు. అన్ని పార్టీలు, సినిమా వాళ్లతో అతనికి సంబంధాలున్నాయని ఫొటోలు వెల్లడిస్తున్నాయి. అతను ఒక పవర్ బ్రోకర్‌గా చెబుతున్నారు. వెంకటేష్ నాయుడు ఇప్పుడు ఏపీ పొలిటికల్ సర్కిల్స్‌లో పెద్ద దుమారం రేపుతున్నాడు. రెండు రోజులుగా ఇతని చుట్టూనే రాజకీయం నడుస్తోంది. అటు వైసీపీకి ఇటు టీడీపీ మధ్య మాటల యుద్ధానికి కేంద్ర బిందువు అయ్యాడు. చెవిరెడ్డి అనుచరుడిగా ప్రచారం జరుగుతోన్న ఈ వెంకటేష్ నాయుడు, రెండు రోజుల క్రితం నోట్ల కట్టలను లెక్కిస్తున్న వీడియో వైరల్ అయింది. దాదాపు 35 కోట్ల రూపాయల నగదును లెక్కించే వీడియో బయటపడటంతో ఎవరీ వెంకటేశ్ నాయుడు అన్న చర్చ జరుగుతుంది. వెంకటేశ్ నాయుడు చిత్తూరు జిల్లాకు చెందిన వ్యక్తి. అతను ప్రయివేటు ఫ్లైట్‌లలో తిరుగుతూ పారిశ్రామికవేత్తలకు కావాల్సిన పనులు చేయించిపెడుతుంటాడు. ఎవరు అధికారంలో ఉంటే వారితో ఫొటోలు దిగడంతో పాటు వారిని మంచి చేసుకోవడం వెంకటేష్ నాయుడు కు వెన్నతో పెట్టిన విద్య. అయితే వెంకటేష్ నాయుడు లెక్కిస్తున్న 35 కోట్ల రూపాయల క్యాష్ ఎవరికి చెందిందన్న దానిపై లోతుగా సిట్ అధికారులు విచారిస్తున్నారు. లిక్కర్ కేసులో అరెస్టయిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి అనుచరుడుగా ఉన్నారు. రెండు వేల నోట్లు ఉండటంతో... కానీ ఈ నోట్ల కట్టల్లో రెండు వేల రూపాయల నగదు కూడా ఉండటంతో ఇది ఎప్పుడు తీసిన వీడియో అన్న దానిపై చర్చ జరుగుతుంది. రెండు వేల కోట్ల రూపాయల నోట్ల రద్దయిన తర్వాత తీసిన ఫొటోనా? అంతకు ముందు తీసిన ఫొటానా? అని అనుమానిస్తున్నారు. ఎన్నికలకు ముందు నందిగామలో పట్టుబడిన క్యాష్ కూడా వెంకటేష్ నాయుడు నిందితుడిగా ఉన్నారు. అయితే ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ కు సంబంధించిన నగదా? లేక మరైదనా క్యాషా? అన్న కోణంలో సిట్ అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. అన్ని రాజకీయ పార్టీల నేతలు, సెలబ్రిటీలతో సత్సంబంధాలు పెంచుకుంటూ నగదును మళ్లించడంలో వెంకటేష్ నాయుడు దిట్టగా పేరుపొందారంటున్నారు.

ఎవరు అధికారంలో ఉంటే...? 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే వైసీపీ నేతలకు వెంకటేష్ నాయుడు చేరువయ్యాడు.వారికి అనుకూలంగా పనిచే శాడంటున్నారు. తర్వాత 2024లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారం కోల్పోయిన వెంటనే టీడీపీ నేతలతో కూడా కలసి తిరగడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. వారితో కూడా దిగిన ఫొటోలు ఇప్పుడు వైసీపీ సోషల్ మీడియాలో పెడుతున్నారు.లిక్కర్ డబ్బులను దాచడం, తరలించడంలో వెంకటేష్ నాయుడు కీలకపాత్ర పోషించారనీ, చెవిరెడ్డి సహా వైసీపీలో కీలక నేతలతో ఆయనకు సంబంధాలు ఉన్నాయనీ టీడీపీ విమర్శలు చేస్తోంది.

అయితే టీడీపీ విమర్శలకి వైసీపీ రివర్స్ ఎటాక్ స్టార్ట్ చేసింది.కేవలం వైసీపీ నేతలతోనే కాదు, టీడీపీ సహా పలు పార్టీల కీలక నేతలతో ఈ వెంకటేష్ నాయుడు ఫోటో దిగాడు. కేంద్ర మంత్రులు, టీడీపీ నాయకులు, బీఆర్ఎస్ కీలక నేతలతో పాటు జగన్‌తోనూ ఫోటోలు దిగారాయన. ఈ ఫోటోలను విడుదల చేసి.. టీడీపీకి కౌంటర్ ఇస్తోంది వైసీపీ.వెంకటేష్ నాయుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ అందరితోనూ సన్నిహితంగా ఉంటారని వైసీపీ చెప్తోంది. అతని వ్యాపారానికి సంబంధించిన డబ్బును.. లిక్కర్ డబ్బు అంటూ ప్రచారం చేస్తున్నారని వైసీపీ ఆరోపిస్తోంది. అది లిక్కర్ డబ్బు అయితే, ఎన్నికల్లో పంచింది అయితే, 2 వేల రూపాయల నోట్లు ఎందుకు ఉంటాయని వైసీపీ ప్రశ్నిస్తోంది. అయితే.. వెంకటేష్‌నాయుడికి వైసీపీతోనే లింకులు ఉన్నాయని అధికార కూటమి వాదిస్తోంది.దీంతో అసలు లిక్కర్ వివాదం కాస్తా పక్కకు వెళ్లి.. వెంకటేష్ నాయుడు ఎవరి అనుచరుడు అనే చర్చ నడుస్తోంది. మీవాడు అంటే మీ వాడు అంటూ వైసీపీ టీడీపీ విమర్శలు చేసుకుంటుంటే ఎవరి వాడో త్వరలో కోర్టులో తెలుస్తుందని అంటోంది సిట్.

అయితే ఇతను ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ నేతలతో సంబంధాలు ఏర్పాటు చేసుకుని పనులు చేయించుకుంటూ, చేసి పెడుతూ వారికి లబ్ది చేకూరు స్తుంటాడన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. వెంకటేష్ నాయుడు ను విచారిస్తే తప్ప పూర్తి విషయాలు వెలుగుచూసే అవకాశాలు లేవంటున్నారు. అయితే ఇతని బ్యాక్ గ్రౌండ్ చూసి పోలీసు అధికారులే బిత్తరపోతున్నారు. రాజకీయ నేతలతో ఉన్న సంబంధాలపై ఆరా తీస్తున్నారు. మొత్తం మీద భారీ నగదుతో ఉన్న వెంకటేష్ నాయుడు వీడియో వైరల్ గా మారింది.

# స్కిల్లింగ్ డ్రైవ్ లో 250కు పైగా కంపెనీలు



**ఒంగోలు-సూర్య వాస్తవం:** దేశంలోనే అతిపెద్ద రెన్యువబుల్ ఎనర్జీ స్కిల్లింగ్ డ్రైవ్‌గా ఇది రికార్డుల కెక్కబోతుండటం విశేషం. ఈ స్కిల్లింగ్ డ్రైవ్ లో 250కు పైగా కంపెనీలు భాగస్వామ్యం కాబోతున్నాయి. గ్రీన్ ఎనర్జీ.. శక్తి వనరుల విషయంలో ప్రపంచ వ్యాప్తంగా విప్లవాత్మక మార్పులు జరుగుతున్న రోజులివి. పునరుత్పాదక శక్తి వనరులపై ప్రపంచం ఆధార పడుతోంది. అదే సమయంలో గ్రీన్ ఎనర్జీ కూడా సరికొత్త ఒక విప్లవానికి నాంది పలుకుతోంది. ఈ గ్రీన్ ఎనర్జీ విషయంలో ఏపీ ముందు వరుసలో ఉండటం విశేషం. ఇందులో భాగంగానే తాజాగా స్కిల్లింగ్ డ్రైవ్ నిర్వహణకు ఏపీని ఎంపిక చేసుకున్నారు. సౌర, పవన శక్తికి నైపుణ్య హబ్ గా ఏపీ అనే నినాదంతో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, స్వనీతి ఇనీషియేటివ్ సంస్థ సంయుక్త భాగస్వామ్యంతో ఈ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో హై-ఇంపాక్ట్ ప్యానెల్ డిస్కషన్స్ జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. సోలార్, విండ్ పవర్ పరిశ్రమలకు చెందిన దిగ్గజాలు, శిక్షణ సంస్థలు, ప్రభుత్వ ప్రతినిధులు ఇందులో పాల్గొంటారు. డిమాండ్ ఆధారిత, పరిశ్రమల అవసరాలకు తగ్గ వర్క్ ఫోర్స్ అభివృద్ధికి రోడ్‌మ్యాప్ ను వారు రూపొందిస్తారు. ప్రైవేట్ సెక్టార్ గ్రీన్ స్కిల్లింగ్ టాస్క్‌ఫోర్స్ ను కూడా ప్రారంభిస్తారు. వర్క్ ఫోర్స్ కి డిమాండ్ ప్రపంచ వ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీకి డిమాండ్ పెరుగుతోంది, దీంతో ఈ రంగంలో నిపుణులైన ఉద్యోగులకు కూడా డిమాండ్ ఉంది. అందుకే డిమాండ్ ఉన్న ఈ రంగంలో పరిశ్రమల ఏర్పాటుతోపాటు, దానికి అవసరమైన నిపుణులను తయారు చేసేందుకు ఏపీ ప్రభుత్వం చొరవ తీసుకుంటోంది. వారికి అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు స్కిల్లింగ్ డ్రైవ్ నిర్వహించేందుకు సిద్ధమైంది. గ్రీన్ ఎనర్జీ కంపెనీలు కూడా ఇందులో భాగస్వాములు కావడం విశేషం. గ్రీన్ ఎనర్జీ రంగానికి అవసరమైన నిపుణుల కొరత లేకుండా చేసేందుకు కంపెనీలు చొరవ చూపుతున్నాయి. ఆ చొరవకు ఏపీ ప్రభుత్వం ప్రోత్సాహాన్నిస్తోంది. ఏపీ కేంద్ర బిందువు భారతదేశం 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని లక్ష్యంగా నిర్దేశించుకుంది. 2030 నాటికి 160 గిగావాట్ల సోలార్, విండ్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకొని ఆంధ్రప్రదేశ్ కార్యాచరణ రూపొందించింది. ఈ లక్ష్యాన్ని అందుకోవాలంటే పరిశ్రమలు రావాలి, అదే సమయంలో దానికి అవసరమైన నిపుణులు కూడా అవసరం అవుతారు. స్కిల్డ్ వర్క్ ఫోర్స్ విషయంపై కూడా ఏపీ దృష్టి పెట్టడం విశేషం. ఆంధ్రప్రదేశ్ ని గ్రీన్ వర్క్‌ఫోర్స్ విప్లవానికి కేంద్రబిందువుగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. పునరుత్పాదక ఇంధన నైపుణ్య అభివృద్ధి కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో వేలాది మంది యువతకు సోలార్, విండ్ ఎనర్జీ రంగాల్లో శిక్షణ ఇవ్వబోతున్నారు. ఇన్ స్టలేషన్, ఆపరేషన్స్, నిర్వహణ అన్నీ ఇందులో కవర్ చేస్తారు. క్లీన్ ఎనర్జీ ఉత్పత్తిలోనే కాకుండా గ్లోబల్ టాలెంట్ ఎక్స్ పోర్టేషన్ కి కూడా ఏపీ కేంద్ర బిందువు కాబోతోంది

# మురుగు నీటికి మ్యాజిక్‌తో చెక్

**విజయవాడ-సూర్య వాస్తవం:** పల్లెటూర్లలో మురుగు నీటి సమస్య అంతా ఇంతా కాదు. ఈ మురుగు కాల్వల ద్వారా వచ్చే సమస్యలు కూడా అన్నీ ఇన్నీ కావు. మురుగు నీటితో దోమలు, కలుషిత నీటి కారణంగా వ్యాధులు ప్రబలి పల్లెటూరివాసులు ఇబ్బందులు పడుతుంటారు. అయితే ఇలాంటి సమస్యలను పరిష్కరించేందుకు ఏపీ ప్రభుత్వం వినూత్నంగా ఆలోచించింది. ఈ క్రమంలోనే మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం చేపడుతోంది. ఇంట్లో నుంచే వచ్చే మురుగు నీరు వెంటనే భూమిలోకి ఇంకేలా ఈ మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామలోని సోమవరంలో ప్రయోగాత్మకంగా ఈ మ్యాజిక్ డ్రైయిన్లు నిర్మించారు. తాజాగా ఏపీ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ గుంటూరు జిల్లా తెనాలి మండలంలో ఈ మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించనుంది. తెనాలి మండలంలోని కొలకలూరులో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి ప్రణాళికలు రచిస్తు?న్నారు. ఎన్టీఆర్ జిల్లాలో మంచి ఫలితాలు ఇవ్వటంతో రెండో ప్రయత్నంగా తెనాలి మండలం కొలకలూరులో మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మిస్తున్నారు.మరోవైపు ఏపీ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ ఇప్పటికే ఇక్కడ పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశారు. కొలకలూరులో గతేడాది భారీ



వర్షాలు కురిశాయి. దీంతో వీధుల్లో మురుగు నీరు నిల్వ ఉండిపోయింది. దీంతో దోమలు అధికమై విషజ్వరాలు, నీరు కలిషితమై అతిసార వచ్చింది. వీధుల్లో నిర్మించిన సిమెంట్ రోడ్ల పక్కన మురుగు నీరు వెళ్లేందుకు కాలువలు నిర్మించకపోవటంతో ఈ పరిస్థితి తలెత్తిందని స్థానికులు వాపోయారు. ఈ నేపథ్యంలో మరోసారి ఇలాంటి పరిస్థితులు రాకూడదనే ఉద్దేశంతో కొలకలూరు బీసీ కాలనీలో మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించనున్నారు.మ్యాజిక్ డ్రెయిన్ విధానం కింద ఇళ్లల్లో నుంచి వచ్చే వ్యర్థపు నీరు నేరుగా భూమిలో ఇంకేలా చూస్తారు. ఇందుకోసం సిమెంట్ రోడ్డు పక్కన, సమాంతరంగా మురుగు కాలువల స్థానంలో 3 కిలోమీటర్ల మేరకు డ్రెయిన్ నిర్మించనున్నారు. ఇళ్లల్లో నుంచి ఈ డ్రెయిన్‌లోకి చేరిన నీరు అక్కడి నుంచి మరోచోటకు పారకుండా ఉండేందుకు గానూ ఒకటిన్నర మీటర్ల లోతు ఉండేలా రోడ్డుకు పక్కనున్న ప్రదేశంలో ఈ డ్రెయిన్ నిర్మాణం చేపడతారు. అలాగే ప్రతీ 50 మీటర్లకు ఒక ఇంకుడు గుంత తవ్వుతారు. అందులో కంకర రాళ్లు నింపి పైన.. చిప్స్ అమర్చుతారు. డ్రెయిన్ పొడవునా కంకరరాళ్లు నింపుతారు. దీంతో మురికినీరు ఇంకుడుగుంతలోకి చేరిన తర్వాత వడపోతకు గురై.. భూమిలో ఇంకుతుంది. దీంతో భూగర్భ జలాలు కూడా పెరుగుతాయని అధికారులు చెప్తున్నారు.సాధారణంగా ఏర్పాటుచేసే కాంక్రీట్ ఛానెల్ డ్రైనేజ్ వ్యవస్థతో పోల్చితే మ్యాజిక్ డ్రెయిన్ల ద్వారా ఇళ్లల్లో నుంచి వచ్చే మురుగు నీరు నేరుగా భూమిలోకి ఇంకుతుంది. అలాగే ఖర్చు కూడా వాటితో పోల్చితే తక్కువ కావటంతో ఈ విధానాన్ని మరికొన్ని పల్లెలకు విస్తరించాలని ఏపీ ప్రభుత్వం ఆలోచిస్తోంది.





# అమరావతిలో పెరిగిన రియల్ ఎస్టేట్

**విజయవాడ-సూర్య వాస్తవం:**అమరావతి రాజధానినిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. చాలా రకాల ప్రాజెక్టుల పనులు ప్రారంభం అయ్యాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు సైతం తమకు కేటాయించిన స్థలాల్లో నిర్మాణాలు ప్రారంభించేందుకు సిద్ధపడుతున్నాయి. మరోవైపు ప్రైవేటు కంపెనీలు సైతం తమ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం సైతం పార్లమెంటులో చట్టం చేసేందుకు సిద్ధపడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో అమరావతి రాజధానికి గతంలో ఎదురైన పరిణామాలు? భవిష్యత్తులో ఎదురు కాబోవని అంతా భావిస్తున్నారు. ఇటువంటి తరుణంలో అమరావతి రాజధాని లో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకోవడం విశేషం. పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ వ్యాపారులు అమరావతి వైపు వస్తున్నారు. ముఖ్యంగా గుంటూరు తో పాటు కృష్ణా జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకుంది.2014లో అధికారంలోకి వచ్చింది తెలుగుదేశం పార్టీఅందరి అభిప్రాయంతో అమరావతిని రాజధానిగా ఎంపిక చేసింది. దీంతో అమరావతి రాజధాని ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు భారీగానే సాగాయి. పెద్ద ఎత్తున వెంచర్లు కూడా పడ్డాయి. అంతేకాదు హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాల నుంచి కూడా అనేకమంది వచ్చి ఇక్కడ భూములు కొనుగోలు చేయడం ప్రారంభించారు. వెంచర్లలో ప్లాట్లను కూడా కొనుగోలు చేశారు. దీంతో అప్పట్లో రియల్ ఎస్టేట్ భారీ స్థాయిలో ముందుకు సాగింది. పొరుగు రాష్ట్రాలకు ధీటుగా ముందుకు సాగింది. కానీ 2019లో జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత సీన్ మారింది. మూడు రాజధానుల అంశం తెరపైకి రావడంతో ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రశ్నార్థకంగా మారింది. కనీస కార్యకలాపాలు నిలిచిపోవడంతో అమరావతి అటవీ ప్రాంతంగా మారిపోయింది. రియల్ ఎస్టేట్ రంగం అమాంతం పడిపోయింది. ఆ రంగంలో పెట్టుబడులు పెట్టినవారు తీవ్రంగా నష్టపోయారు.వాస్తవానికి జగన్ మోహన్ రెడ్డి సైతం అమరావతి రాజధానిని కొనసాగిస్తారని అంతా భావించారు. కానీ ఆయన అనూహ్యంగా చంద్రబాబును దృష్టిలో పెట్టుకుని మూడు రాజధానులు అంశాన్ని తెరపైకి తెచ్చారు. 2020లో మూడు రాజధానుల ప్రతిపాదన చేయడంతో ఒక్కసారిగా అమరావతిలో రియల్ ఎస్టేట్ పడిపోయింది. ఆ తరువాత వ్యాపార వర్గాలు హైదరాబాదును ఎంచుకోవడంతో అక్కడి ప్రభుత్వం వ్యాపారులను స్వాగతించింది. అప్పట్లోనే ఏపీలో జగన్ ఉంటే తమ వ్యాపారాలు బాగుంటాయని తెలంగాణ పాలకులు వ్యాఖ్యానించే పరిస్థితి వచ్చింది. గత ఐదు సంవత్సరాల్లో అమరావతిలో ఒక్క ఇటుక కూడా వెయ్యలేదు. దీంతో దాదాపు 50 వేల ఎకరాల భూములు అడవిలా మారిపోయాయి. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే అక్కడ జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టింది. వాస్తవానికి టీడీపీ కూటమి వచ్చిన వెంటనే రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందుతుందని అంతా భావించారు. అయితే హైదరాబాదులో రియల్ ఎస్టేట్ రంగం విస్తృతికి అక్కడి ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. దీంతో తొలి ఏడాదిలో అమరావతి వైపు రియల్ ఎస్టేట్ వ్యాపారులు చూడలేదు. దీనిని గుర్తించిన సీఎం చంద్రబాబు అమరావతిని విస్తరించి ప్రయత్నాలను చేసి చూపించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులను ఆకర్షించే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం అమరావతిలో ఎక్కడ చూసినా రియల్ ఎస్టేట్ వ్యాపారులు, వెంచర్లు భారీ ఎత్తున కనిపిస్తున్నాయి. వందలాది, వాహనాలు యంత్రాలు, కార్మికులు, ఉద్యోగులతో కళకళలాడుతూ కనిపిస్తోంది. ప్రస్తుతం తుళ్లూరు, వెంకటాయపాలెం, మంగళగిరి ప్రాంతాల పరిధిలో రోజుకు కనీసం 20 నుంచి 30 రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సంబంధించిన లావాదేవీలు జరుగుతున్నట్లు అధికారిక వర్గాలు చెబుతున్నాయి. మొత్తానికైతే అమరావతిలో రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకోవడం విశేషం.

# ఆగస్టు 19నుంచి పీ4

**తిరుపతి- సూర్య వాస్తవం:** ఏపీ ప్రభుత్వం మరో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. ఆగస్ట్ 19 నుంచి ఏపీలో పీ-4 కార్యక్రమం అమలు కానుంది. ఈ విషయాన్ని సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. పీ-4 కార్యక్రమం కింద ఇప్పటికే మార్గదర్శులు, బంగారు కుటుంబాల ఎంపిక ప్రక్రియ జరుగుతోంది. ఇప్పటి వరకూ సుమారుగా లక్ష మంది మార్గదర్శులను, 9 లక్షల 37 వేల బంగారు కుటుంబాలను ఏపీ ప్రభుత్వం గుర్తించింది. అయితే మార్గదర్శుల ఎంపికలో బలవంతం లేదని చంద్రబాబు స్పష్టం చేశారు.ఆగస్ట్ 19 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో కొత్త కార్యక్రమం అమల్లోకి రానుంది. ఆగస్ట్ 19 నుంచి పీ-4 కార్యక్రమం అమలు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. పీ-4 కార్యక్రమం అమలుపై సీఎం నారా చంద్రబాబు నాయుడు మంగళవారం సమీక్ష నిర్వహించారు. సచివాలయం వేదికగా జరిగిన సమీక్షా సమావేశంలో సీఎంతో పాటుగా ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేదరిక నిర్మూలన కోసం ఏపీ ప్రభుత్వం చేపట్టిన పీ-4 కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని చంద్రబాబు అన్నారు. పీ4 కార్యక్రమం కింద బంగారు కుటుంబాలకు మెరుగైన జీవన ప్రమాణాలను కల్పించడమే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని వివరించారు. అలాగే మార్గదర్శుల ఎంపికలో వ్యతిరేకత రాకుండా చూడాలని చంద్రబాబు సూచించారు.మరోవైపు పీ-4 కార్యక్రమం కింద సంపన్న వర్గాలలోని తొలి 10 శాతం మంది.. అట్టడుగున ఉన్న 20 శాతం వర్గాలను దత్తత తీసుకుని వారి అభివృద్ధికి తోడ్పడటమే దీని ముఖ్య ఉద్దేశం. దత్తత తీసుకునే వారిని మార్గదర్శులు అని.. పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా పేర్కొంటారు. అయితే మార్గదర్శుల ఎంపిక పూర్తిగా స్వచ్ఛందంగానే జరుగుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు. మార్గదర్శులుగా మారాలని ఎక్కడా ఎవరినీ బలవంతం చేయొద్దని అధికారులను ఆదేశించారు. మంచి పనులను అడ్డుకునేందుకు కొంతమంది ప్రయత్నిస్తారని.. ప్రజలలో వ్యతిరేకత తెచ్చేందుకు ప్రయత్నిస్తారని చంద్రబాబు చెప్పుకొచ్చారు. అప్పట్లో జన్మభూమి, శ్రమదానం చేపట్టిన సమయంలోనూ ఇలాంటి సమస్యలు ఎదుర్కొన్నట్లు చంద్రబాబు గుర్తు చేశారు.మరోవైపు బంగారు కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. బంగారు కుటుంబాలకు యథాతథంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి అందుతుందని.. అలాగే పీ-4 కార్యక్రమం కింద అదనపు సాయం అందిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 9,37,913 బంగారు కుటుంబాలను ఎంపిక చేసినట్లు చంద్రబాబు తెలిపారు.




# 'ఘాట్ లో ఘాటీలే ఉంటారు సార్'.. పవర్ ఫుల్ గా ఘాటీ ట్రైలర్..

**- టాలీవుడ్ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఆ సినిమా కూడా ఒకటన్న విషయం తెలిసిందే. విక్రమ్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తున్నారు**

స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి.. ఇప్పుడు కెరీర్ లో మళ్ళీ స్పీడ్ పెంచింది. చివరగా మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి మూవీతో వచ్చి మంచి విజయాన్ని అందుకున్న అమ్మడు.. ఇప్పుడు ప్రతిష్టాత్మక మూవీ ఘాటీతో సందడి చేయనుంది. టాలీవుడ్ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఆ సినిమా కూడా ఒకటన్న విషయం తెలిసిందే. విక్రమ్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. క్రైమ్ అండ్ యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కుతున్న ఆ సినిమాను క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే అనుష్క, క్రిష్ కాంబోలో వచ్చిన వేదం మూవీ మెప్పించింది. ఇప్పుడు మరోసారి కాంబో రిపీట్ అవ్వడంతో అంతా భారీ అంచనాలు పెట్టుకున్నారు. అదే సమయంలో సినిమా నుంచి రిలీజ్ అయిన పోస్టర్స్, టీజర్ పాజిటివ్ బజ్ క్రియేట్ చేసి అంచనాలు పెంచాయి.తాజాగా మూవీ ట్రైలర్ విడుదల చేశారు మేకర్స్. విడుదల తేదీపై కూడా క్లారిటీ ఇచ్చారు. సెప్టెంబర్ 5వ తేదీన సినిమాను రిలీజ్ చేస్తున్నట్లు తెలిపారు. థియేటర్లలో చిత్రం ప్రేక్షకులను అలరించనుందని మేకర్స్ హామీ ఇస్తున్నారు. అదే సమయంలో ట్రైలర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సినీ ప్రియులను ఆకట్టుకుని దూసుకుపోతోంది. ట్రెండింగ్ లో కూడా నిలిచింది.ఘాట్లకు చెందిన వ్యక్తిగా అనుష్కను పరిచయం చేశారు మేకర్స్. గంజాయిని అక్రమంగా రవాణా చేస్తుంటుంది. ఆమె పార్ట్ టైమ్‌లో బస్ కండక్టర్‌గా పని చేస్తుంటుంది. ఆ టిపికల్ జాబ్‌లో కూడా స్ట్రాంగ్‌గా వర్క్ చేస్తుం టుంది. విక్రమ్ ప్రభు ఆమె ప్రేమికుడిగా, విప్లవకారుడిగా కనిపిస్తాడు. చైతన్యరావు, జాన్‌విజయ్, రవీంద్ర విజయ్ విరో ధులుగా.. జగపతిబాబు పోలీసు అధికారిగా కనిపిస్తారు. సినిమాలో అనుష్క నేరస్థురాలిగా మారిన ఓబాధితురాలిగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఆమె చేతి పైన ఓవిచిత్రమైన టాటూ స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది. ఓవరాల్‌గా అనుష్కను ఫుల్ వైలెంట్ గా చూపించారు మేకర్స్. అనుష్క కనిపించిన ప్రతి షాట్ చూడటానికి ఒక విందుగా ఉంటుంది. ఘాట్‌లో ఘాటీలే ఉంటారు సార్ అంటూ ఆమె చెప్పే డైలాగ్స్ అదిరిపోయాయి. కఠినమైన కథను ప్రేక్షకులను భావోద్వేగాలతో కదిలించే విధంగా చెప్పడానికి దర్శకుడు క్రిష్ చాలా ప్రయత్నించినట్లు స్పష్టంగా అర్థమవుతుంది. అద్భుతమైన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ట్రైలర్ కు బిగ్ అసెట్‌గా నిలిచింది. యాక్షన్ సీన్స్ అదిరిపోయాయి. క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్స్ నిర్మాణ విలువలు అద్భుతంగా ఉన్నాయి. ఓవరాల్ గా ట్రైలర్ ను మేకర్స్ బాగా కట్ చేశారని చెప్పాలి. ష్యూర్ షాట్ విన్నర్‌గా నిలిచిన ట్రైలర్ సినిమాపై ఆసక్తిని భారీగా రేపింది.

## సొంత ఇలాకాలో కనుమరుగవుతున్న అవకాశాలు..

# సౌత్‌పై పడ్డ మృణాల్ దృష్టి!

**- కానీ అక్కడ చేసే సినిమాలు ఫ్లాప్ అవ్వడంతో మళ్ళీ సౌత్ ఇండస్ట్రీ పైపే అడుగులు వేస్తున్నారు**



హీరోయిన్ అవ్వాలనే ఆశయంతో సీరియల్స్ ద్వారా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది మృణాల్ ఠాకూర్. పలు సీరియల్స్ లో మెప్పించి ఆ తర్వాత మరాఠీ, హిందీ సినిమాల ద్వారా హీరోయిన్‌గా మారింది. అలా నార్త్ లో సినిమాలు చేస్తున్న టైంలో మృణాల్ ఠాకూర్‌కి తెలుగులో సీతారామం అనే సినిమాలో అవకాశం వచ్చింది. ఈ సినిమా మృణాల్ సినీ జీవితాన్నే మార్చేసిందని చెప్పవచ్చు. ఈ సినిమాతో మృణాల్ కి చాలా క్రేజ్ కూడా వచ్చింది. ఆ తర్వాత వరుస అవకాశాలు తలుపు తట్టాయ్. అయితే చాలామంది హీరోయిన్లు సౌత్ సినిమాల ద్వారా ఫేమస్ అయినప్పటికీ... వారి దృష్టంతా బాలీవుడ్ పైనే ఉంటుంది. బాలీవుడ్ లో స్టార్ గా రాణించాలని కలలు కంటారు. కానీ అక్కడ చేసే సినిమాలు ఫ్లాప్ అవ్వడంతో మళ్ళీ సౌత్ ఇండస్ట్రీ పైపే అడుగులు వేస్తున్నారు. అలాంటి వారిలో మృణాల్ ఠాకూర్ కూడా ఉందని చెప్పుకోవచ్చు. ఎందుకంటే మొదట నార్త్ లో సినిమాలు చేసి సక్సెస్ కాలేదు.కానీ సౌత్ లో చేసిన సీతారామం సినిమాతోనే సక్సెస్ అయింది. అలా సీతారామం తర్వాత హాయ్ నాన్న సినిమాతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. 2024లో వచ్చిన ఫ్యామిలీ స్టార్ మూవీ నిరాశపరిచినప్పటికీ సౌత్ లో మృణాల్ క్రేజ్ అయితే తగ్గలేదు. అయితే అలాంటి మృణాల్ ఠాకూర్ బాలీవుడ్ మీద ఉన్న ఇంట్రెస్ట్ తో సన్ ఆఫ్ సర్దార్ 2 మూవీలో చేసింది. కానీ ఈ సినిమా విడుదలై బాక్సాఫీస్ వద్ద ఫ్లాప్ టాక్ తెచ్చుకుంది. అంతేకాకుండా ఈ సినిమాలో మృణాల్ కి అంత ప్రాధాన్యత కూడా లేదు. దాంతో మృణాల్ కెరీర్ ఇరకాటంలో పడిపోయింది. పైగా ఈమెకు అవకాశం ఇవ్వడానికి కూడా బాలీవుడ్ లో ఎవరు ఆసక్తి కనబరచలేదనే వార్తలు వినిపిస్తున్నాయి. అలా సొంత ఇలాకాలో అవకాశాలు కోల్పోతుండడంతో ప్రస్తుతం మృణాల్ ఠాకూర్ ఆశలన్నీ సౌత్ సినిమాల పైన పెట్టుకుంది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ అడివి శేష్ డెకాయిట్ మూవీలో చేస్తోంది. ఈ సినిమా గనుక హిట్ కాకపోతే సౌత్ లో కూడా మృణాల్ మార్కెట్ పడిపోతుంది. అందుకే తన ఫోకస్ మొత్తం సౌత్ సినిమాలపైనే పెట్టిందట. ప్రస్తుతం మృణాల్ డెకాయిట్ మూవీ తోపాటు అట్లీ , అల్లుఅర్జున్ కాంబోలో వస్తున్న సినిమాలో కూడా హీరోయిన్ గా ఫిక్స్ అయినట్టు సినీ వర్గాల్లో రూమర్స్ వినిపిస్తున్నాయి. ఒకవేళ ఈ సినిమాలు హిట్ కొట్టినా చాలు మృణాల్ దశ తిరిగినట్టే.. మరి మృణాల్ ఠాకూర్ కెరీర్ మళ్ళీ గాడిన పడుతుందా? లేదా? అనేది చూడాలి.



# గ్రాండ్‌స్లామ్ ప్రైజ్ మనీ పెంపు

**- 20% పెంపుదల చేస్తున్నట్లు ప్రకటన**

**న్యూయార్క్:** టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ నిర్వాహకులు ఆటగాళ్లకు అందజేసే ప్రైజ్ మనీని పెంపుదల చేస్తున్నారు. ఈ ఏడాది నుంచి గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఆటగాళ్లకు అందజేసే ప్రైజ్ మనీని పెంపుదల చేయాలని కోరుతూ స్టార్ ఆటగాళ్లు జకోవిచ్, కోకో గాఫ్, సబలెంక, సిన్నర్ తదితరులు లేఖలు పంపిన క్రమంలో టోర్నీ నిర్వాహకులు ప్రైజ్ మనీని పెంపుదల చేస్తున్నట్లు సమాచారం. 2025లో వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ నిర్వాహకులు ఆటగాళ్లకు అందజేసిన ప్రైజ్ మనీని పెంపుదల చేయగా.. తాజాగా యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ నిర్వాహకులు కూడా 20శాతం ప్రైజ్‌మనీని పెంపుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు యుఎస్ టెన్నిస్ అసోసియేషన్ బుధవారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది.

యుఎస్ ఓపెన్‌లో ఆటగాళ్లందదరూ కలిపి భారత కరెన్సీలో సుమారు 746కోట్ల రూపాయలు (85 మిలియన్ డాలర్లు) ప్రైజ్‌మనీ అందుకోనున్నారు. సింగిల్ విజేత 5 మిలయన్ డాలర్ల ప్రైజ్ మనీ అందుకోనుండగా.. గత ఏడాదితో పోల్చిచూస్తే టోర్నీ నిర్వాహకులు ఆటగాళ్లకు అందజేసే ప్రైజ్ మనీని 20 శాతం నుంచి 90శాతం మిలియన్ డాలర్లకు పెంచుతున్నట్లు తాజాగా తెలిపారు. నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీలలోకెల్లా ఇదే అత్యధిక పారితోషికం కావడం విశేషం. 2024లో 75మిలియన్ డాలర్ల ప్రైజ్ మనీ అందజేయగా.. ఈసారి అది 90మిలియన్ డాలర్లకు చేరింది.




# ఇక మన హైదరాబాదీనే భారత పేస్ దళపతి.. భవిష్యత్ కెప్టెన్

**- ఏమాత్రం ఆశలు లేని స్థితి నుంచి జట్టును గెలిపించిన తీరు అమోఘం.. దీంతో ప్రస్తుతం నేషనల్ హీరో అయిపోయాడు...! అతడే మన హైదరాబాదీ పేసర్ మొహమ్మద్ సిరాజ్**



ఐదుకు ఐదు టెస్టులు... 185.3 ఓవర్లు... 1113 బంతులు... 23 వికెట్లు..! అలసటే లేదు.. గాయం మాట అన్నదే లేదు.. సిరీస్ లో రెండు టెస్టులు గెలిస్తే రెండింట్లోనూ అతడి పాత్ర కీలకం.. చివరి మ్యాచ్ లో అయితే ఒక ప్రత్యర్థికి చుక్కలు చూపాడు.. ఏమాత్రం ఆశలు లేని స్థితి నుంచి జట్టును గెలిపించిన తీరు అమోఘం.. దీంతో ప్రస్తుతం నేషనల్ హీరో అయిపోయాడు...! అతడే మన హైదరాబాదీ పేసర్ మొహమ్మద్ సిరాజ్.

**గాయం ఎరుగుని పేసు గుర్రం:** మొహమ్మద్ షమీకి గాయాల బెడద ఉంది.. వయసు కూడా 35. మళ్లీ అతడు జాతీయ జట్టుకు ఆడడం కష్టమే.. జస్ప్రీత్ బుమ్రాకు గాయాల సమస్య మరింత తీవ్రం.. ప్రస్తుత ఇంగ్లండ్ టెస్టు సిరీస్ లో మూడు టెస్టులు ఆడడమే గగనమైంది. కొత్త కుర్రాళ్ల ప్రసిద్ధ్ క్రిష్ణ, ఆకాశ్ దీప్ ఇంకా కుదురుకోలేదు.. ! కానీ, ఒకే ఒక్కడు అన్నట్లు సిరాజ్ చెలరేగిపోతున్నాడు. ఏమాత్రం అలుపుసొలుపు లేకుండా బౌలింగ్ చేస్తూనే ఉన్నాడు. ప్రత్యర్థి బ్యాట్స్ మెన్ చితకబాదుతున్నా.. తనదైన సమయం కోసం ఎదురుచూసి వికెట్లు తీస్తున్నాడు. గత 10 నెలల కాలంలో అతడు ఎక్కడా విశ్రాంతి తీసుకున్నదే లేదు. ఐపీఎల్ సహా..!

**బుమ్రా లేకుంటేనే సిరాజ్ బజ్:** జట్టులో ఉంటే భారత ప్రధాన పేస్ బౌలర్ బుమ్రానే. కానీ, ఇకమీదట సిరాజ్ తర్వాతే బుమ్రా. 41 టెస్టులు ఆడిన 123 వికెట్లు తీశాడు. 25 మ్యాచ్ లలో బుమ్రాతో కలిసి బౌలింగ్ చేస్తే 74 వికెట్లు తీశాడు. బుమ్రా లేకుండా ఆడిన 16 టెస్టుల్లో 49 వికెట్లు పడగొట్టాడు. తాజా ఇంగ్లండ్ సిరీస్ లో టీమ్‌ఇండియా గెలిచిన ఎడ్జ్‌బాస్టన్, ఓవల్ టెస్టుల్లో బుమ్రా లేడు. ఈ రెండు టెస్టుల్లో సిరాజ్ 16 వికెట్లు తీశాడు. అందుకే.. బుమ్రా అందుబాటులోకి వచ్చినా ఇకమీదట సిరాజే భారత ప్రధాన పేసర్ అని ప్రఖ్యాత క్రికెటర్, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ గ్రెగ్ చాపెల్ అభిప్రాయపడ్డాడు.

**బుమ్రా కంటే బెటర్...:** జస్ప్రీత్ బుమ్రా త్వరలో టెస్టు క్రికెట్ వీడ్కోలు పలుకుతాడనే కథనాలు వస్తున్నాయి. ఇదే నిజమైతే సిరాజ్ ది ప్రధాన పాత్ర అవుతుంది. ఇప్పటికే ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ సిరీస్ లలో సిరాజ్ అదరగొట్టాడు. వీటిలో చాలాసార్లు బుమ్రా అందుబాటులో లేడు. ఇంగ్లండ్ పై ఓవల్ టెస్టులో బుమ్రా లేకున్నా.. జట్టును గెలిపించడంతో సిరాజ్ స్థాయి మరింత పెరిగింది. దీంతోనే బుమ్రా వర్సెస్ సిరాజ్ అనే ఆరోగ్యకర చర్చ నడుస్తోంది. బుమ్రా అత్యంత ప్రతిభావంతుడైన బౌలర్ అయినప్పటికీ... ఫిట్ నెస్, ఫామ్ రీత్యా సిరాజ్ కే కాస్త ఎక్కువ మార్కులు పడుతున్నాయి. ఐపీఎల్ లో అన్ని మ్యాచ్ లు ఆడిన బుమ్రా.. జాతీయ జట్టుకు కొన్ని మ్యాచ్ లకే అందుబాటులో ఉన్నాడు. సిరాజ్ మాత్రం ఐపీఎల్ ఆడినా.. అనుభవం లేని కుర్రాళ్లతో పేస్ దళాన్ని నడిపించి మంచి మార్కులు కొట్టేశాడు. ఇక ఓవల్ టెస్టులో అతడి అంకితభావం, పోరాట పటిమ అభిమానులను లిసలామ్ డీఎస్పీ సాబ్‌లి అనిపించింది. 31 ఏళ్ల సిరాజ్ ప్రస్తుతం ప్రధాన బౌలర్.. భవిష్యత్ లో శుబ్ మన్ గిల్, రిషభ్ పంత్ అందుబాటులో లేకుంటే కెప్టెన్ అయ్యే చాన్సుంది. ఏమో.. దేన్నీ కాదనలేం.. 2015 వరకు క్రికెట్ బంతితో ప్రాక్టీస్ చేయని, సాధారణ ఆటో డ్రైవర్ కుమారుడు అయిన సిరాజ్ ఇక్కడి వరకు రాలేదా? ఒకవేళ అతడు టీమ్‌ఇండియా కెప్టెన్ అయితే.. అజహరుద్దీన్ తర్వాత టీమ్ ఇండియాకు మరో హైదరాబాదీ ఆటగాడు కెప్టెన్ అయిన రికార్డు దక్కుతుంది.

### అగ్రవర్ణాల చేతిలో బలైన మాదిగ, మాల

# సోదరులకు నివాళులు అర్పించిన దళిత సంఘాలు



**గుత్తి -సూర్య వాస్తవం, ఆగస్టు 6:** గుత్తి పట్టణంలో అంబేద్కర్ విగ్రహంవద్ద కారంచేడు, చుండూరులో దాదాపు 40 సంవత్సరాల క్రితం జరిగిన సంఘటనను నిరసిస్తూ బ్లాక్ డేగా నిర్వహించారు.కరం చేడు గ్రామంలో 1985లో మాదిగలను చంపిన టీడీపీ ఎన్టీఆర్ కమ్మ ప్రభుత్వం చుండూరులో 1 991లో మాలలను చంపిన కాంగ్రె స్ నేదురు మళ్ళీ జనర్ధన్ రెడ్డి ప్ర భుత్వం అయితే మాదిగలను చంపిన కమ్మ పార్టీ టీడీపీకి మా దిగలు మద్ధతు ఇస్తున్నారు మా లలను చంపిన కాంగ్రెస్ రెడ్డి పార్టీ కి మాలలు మద్దతు ఇస్తున్నారు మాల మాదిగల శత్రువు అయి నా కమ్మ రెడ్డి పార్టీలకు మన ఓట్లు వేయిస్తున్నారు మన మాల మాదిగ స్వార్థ నాయకులు చీటర్‌లు కమ్మరెడ్డి పార్టీల వాల్లు మన ఓట్లు తీసుకొని మనకు శవాల గిఫ్ట్ ఇస్తున్నారు వర్ధంతిలు చేసుకొ మ్మని సిగ్గు సిగ్గు ఇంత కన్నా నీచ మైన చరిత్ర ఈ ప్రపంచంలో ఎక్క డ లేదు జోహార్ కారంచెడు చూ దూరు మృత వీరులకు డీఎల్ మాల ఎవైస్ అధ్యక్షులు న్యాయ స్థానాల చరిత్రలో నూతనాధ్యా యంగుంటూరు,జూలై 31(ఆన్లైన్ -లీగల్) చుండూరు మారణ హెూ మం దేశ న్యాయస్థానాల చరిత్రలో మరో కొత్త అధ్యాయానికి తెరతీసింది.నేరం.జరిగిన ప్రాంత ంలోనే ప్రత్యేక కోర్టును ఏర్పాటుచేసి కేసు విచారణ జరిపి తీర్పును ఇవ్వటం దేశం చరిత్రలో ఇదే ప్రథమం. దేశాధినేతల హత్య కేసుల్లో జైళ్లలోనే కోర్టులు ఏర్పాటు చేసి విచారణ జరిపి తీర్పులు వెల్లడిం చిన సంఘటనలే ఇప్పటి వరకు జరిగాయి.మొగల్ వారసుడు బ హదూర్ష జఫరై అప్పటి బ్రిటిష్ ప్ర భుత్వం రాజద్రోహ నేరం కింద ఎ ర్ర కోటలో విచారణ జరిపింది.భగత్ సింగ్ పై తీహార్ జైలులో విదా రణ జరగగా,మహాత్మాగాంధీ హ త్య రేసు విచారణ ఎర్ర కోటలో జ రిగింది.ఇందిరా గాంధీ హత్యకేసు విచార ణన్యాయ సానముగా పద హారేళ్లుగా మండూరు కేసును వి ధారించిన ప్రత్యేక న్యాయస్థానం ఇదే తీహార్ జైలులో సాగగా,రాజీ వ్ గాంధీ హత్య కేసు విచారణ రా య వెల్లూరు జైలులో ఏర్పాటుచే సిన ప్రత్యేక కోర్టులో జరిగింది.నే రం జరిగిన ప్రాంతంలోనే కోర్టు ఏ ర్పాటుచేసి విచారణ జరిపి తీర్పు ఇవ్వటం దేశ చరిత్రలో చుండూ రు కేసుతోనే ప్రారంభం.మారణ హెూమం అనంతరం దళితులు ప్ర జాసంఘాల ఆందోళనలతో దిగి వచ్చిన ప్రభుత్వం సంఘటన జరిగిన ప్రాంతంలోనే కోర్టును ఏర్పా టు చేసికేసు విచారణ జరిపించ టానికి ముందుకు వచ్చింది.1991 నవంబరు 11న చుండూరులో నే కేసు విదారణకు కోర్టు ఏర్పా టుకు సుముఖత వ్యక్తం చేస్తూ జీ వోఆర్టి 665/91ని విడుదల చే సింది.1991 డిసెంబరు 4న రా ష్ట్ర ప్రభుత్వ హెూంశాఖ కార్యదర్శి చుండూరు కేసును చుండూరులో నే విధారణ జరపటానికి ప్రభు త్వం నిర్ణయించిందని పేర్కొంటూ హైకోర్టు అనుమతి కోసం లేఖరాశారు. మరునాడే హైకోర్టు రిజిస్ట్రార్ నుంచి అనుమతి వచ్చింది. దీంతో ప్రభుత్వం చుండూరులోని దళితవాడ వద్ద ఓ స్కూల్ భవ నానికి మరమ్మతులు చేసి క్యాంపు కోర్టును సిద్ధం చేసింది. ఈ కో ర్టులోనే చుండూరు కేసు విచారణ మొత్తం సాగింది. ఈ కార్యక్రమంలో బండల రామాంజనేయులు ఎమ్మా ర్పీఎస్ జిల్లా అధ్యక్షు డు అంజన్ ప్రసాద్ అగ్గి రాముడు కె వి పి ఎస్ మండల కార్యదర్శి మల్లికార్జున కొండయ్య బేల్దారి చంద్ర మిద్దె ఓబులేష్ ధర్మాపురం రమేష్ రంగస్వామి ఓబులేష్ రా ముడు మణి తదితరులు పాల్గొ న్నారు.



## ఆకస్మికంగా స్కూల్ తనిఖీ చేసిన జిల్లా విద్యా శాఖ అధికారి

**గాండ్లపెంట- సూర్య వాస్తవం,ఆగస్టు 6 :** మండలంలోని కటారుపల్లి గ్రామంలో జడ్పీహెచ్ స్కూల్, మాడల్ ప్రైమరీ స్కూల్‌లను బుధవారం జిల్లా విద్యాధికారి కిష్టప్ప సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి కృష్ణప్ప మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని, పరీక్ష ఫలితాలలో ఉత్తమ ఫలితాలను అందించాలని ఆదేశించారు, రికార్డులను పరిశీలించారు పిల్లలను పరీక్షించడం, పాఠశాలల స్థితి గతుల గురించి అడిగి తెలుసుకున్నారు ఉపాధ్యాయుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మోడల్ ప్రైమరీ స్కూల్లో 84 మంది విద్యార్థులు ఉండడంతో అందరూ యూనిఫామ్ ధరించడంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. మరిన్ని సమస్యలకు పరిష్కారం మార్గాలను సూచిస్తూ ఇంకా అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా జడ్పీహెచ్ స్కూల్ నందు జిల్లా విద్యాశాఖ అధికారి కృష్ణప్ప కు దుశ్యాలువ కప్పి సన్మానించారు. రికార్డులు పరిశీలించి, పదవ తరగతి విద్యార్థులకు విద్యా గురించి అడిగి తెలుసుకుని ఉపాధ్యాయులకు మెరుగైన విద్యను అందించాలని ఆదేశించారు. అదేవిధంగా పిల్లలను టచేసి సంతృప్తి వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సరళ, సురేష్ బాబు, ప్రమీల, మాధవి షంషీర్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

## డీఆర్ఓ మలోలా

**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం, ఆగస్టు 6:** పంచాయితీ, మునిసిపాలిటీ పరిధిలో ఉన్న నీటి వనరుల ఆక్ర మణలను గుర్తించి ప్రభుత్వ నిబంధనల మేరకు అట్టివారిపై నోటీసులు జారీ చేసి తొలగించే విధంగా సత్వర చర్యలు తీసుకోవాలని డిఆర్ఓ మలోలా సంబంధిత శాఖఅధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా స్థాయి నిఘా కమిటీ (వాచ్ డాగ్ కమిటీ) సమావేశాన్ని డిఆర్ఓ నిర్వహించి పలు ఆదేశాలు సూచనలు జారీ చేశారు.ఈ సందర్భంగాడిఆర్ఓ మాట్లా డుతూ.... పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చెరు వులు, నీటి వనరులు, ట్యాంక్ బెడ్స్ లో ఉన్న ఆక్ర మణలను అర్బన్ ప్రాంతంలో మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు



సమన్వయంతో ఒక బృందంగా క్షేత్ర స్థాయిలో వెళ్లి అక్కడ ఉన్న వాస్తవ స్థితిగతులను పరిశీలన చేసి ఆక్రమణలను గుర్తించి వాటిని తొలగించాలని, నీరు సాఫీగా వెళ్లేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.386 ప్రకారం ఇంతకు ముందు ఎన్ని చెరువులు, నీటి వనరులు ఆక్రమి ంచారు, వాటిలో ఎన్ని ఆక్రమణలు తొలగించారు, తదితర అంశాలకు సంబంధించి ఈ సందర్భంగా సమీ క్షించారు. వచ్చే సమావేశంలో ఈ అంశాలలో పురోగతిని సాధిం చాలని జిల్లా రెవెన్యూ అధికారితెలిపారు. ఆక్ర మణలను గుర్తించి వాటిని వారంలోగా తొలగించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్సీ విశ్వనాథరెడ్డి, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి దేవి, పంచాయతీరాజ్, టౌన్ ప్లానింగ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై దృష్టిని సారించాలి

**- పెండింగ్ పనులను వేగవంతం చేయాలి..**
**- ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ శర్మ**

**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం,ఆగస్టు 6:** ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల పై ప్రత్యేక దృష్టిని సారించి వాటిని అమలు చేయాలని అలాగే సి.యం. ఓ. మంత్రులు మరియు ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, రెవెన్యూ సెక్టార్, పిజిఆర్ఎస్, వివిధ సేవా పోస్టర్ల ద్వారా వచ్చిన ఫిర్యాదుల పెండింగ్ పనులను వేగవంతం చేసిఎప్పటి కప్పుడు పరిష్కరించాలని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచిడివిజన్ ,మండల స్థాయి రెవెన్యూ సెక్టార్ తదితర అంశాలకు సంబంధించిన అధికారులతో వీడియో



కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ కలెక్టర్ సమీక్షిస్తూ ముఖ్యంగా వివిధ రీతిలో వచ్చిన ఫిర్యాదులపై స్పందించి వాటిని క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో ఆయా శాఖలో పనిచేస్తున్న ఉద్యోగ సిబ్బంది సేవలను వినియోగించుకొని అర్జీదారులు సంతృప్తి పొంద ే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు మంచిచేసేలా అధికారులు ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య పనులు క్రమం తప్పకుండా చేపట్టాలని అలాగే చెత్తసేకరించి తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ అంశంలో సంబంధిత శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి ఎలాంటి సమస్యలు లేకుండా పర్యవేక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. పౌరసరఫరా, పిజిఆర్ఎస్ , ఐవిఆర్ఎస్ చుక్కల భూముల ప్రక్రియ తదితర అంశాలలో పురోగతిని సాధించాలని, క్షేత్రస్థాయిలో ఉన్నతాసిల్దారులు, సివిఎస్‌డి టిలు పిఎఫ్ షాపుల తనిఖీతో పాటు నిత్యవసర సరుకులు సక్రమంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, ఇంచార్జ్ కలెక్టర్ ఆదేశించారు. గుంతకల్, ఉరవకొండ, బొమ్మనహాల్, పామిడి ఎల్లనూరు ,యాడికి తదితర మండలాల్లో రీఓపెన్ కేసులు ఉన్నందున వాటిని సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ సహార్, అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ శైలజ , ఈజీ ఆర్ ఎస్ తాసిల్దార్ వాణిశ్రీ, సర్వే ఏ.డి. రూప్ల నాయక్, కలెక్టరేట్ సూపర్డెంట్లు

## ట్రంప్ మరో బాదుడు

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. జులై 30న ప్రకటించిన 25 శాతం సుంకంతో కలిపితే తాజా పెంపుతో సుంకాలు 50 శాతానికి చేరాయి. దీంతో భారత్ నుంచి అమెరికా దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై భారీ టారిఫ్‌లు అమల్లోకి రానున్నాయి. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను కొనసాగిస్తున్నందుకు ఈ చర్య తీసుకున్నట్లు ట్రంప్ తెలిపారు. మొదటి 25 శాతం సుంకం ఆగస్టు 7 నుంచి, తాజాగా ప్రకటించిన 25 శాతం సుంకం ఆగస్టు 27 నుంచి అమల్లోకి రానుంది. భారత్ ప్రతీకార సుంకాలు విధిస్తే.. ఈ టారిఫ్‌లను మరింత పెంచి సవరించే అధికారం అధ్యక్షుడికి ఉంటుందని వైట్‌హౌస్ హెచ్చరించింది. చైనాపై 51 శాతం, మలేసియాపై 25 శాతం, శ్రీలంకపై 30 శాతం, వియత్నాంపై 20 శాతం, జపాన్‌పై 15 శాతం చొప్పున యుఎస్ సుంకాలను విధించింది. పాకిస్థాన్‌పై విధించిన 19 శాతం సుంకాలతో పోల్చితే భారత్‌ను ట్రంప్ ఏ విధంగా ట్రీట్ చేస్తున్నారో స్పష్టమవుతోంది.

**మోడీ ఇప్పటికైనా స్పందించాలి : ప్రతిపక్షాలు**

ట్రంప్ చర్యలను ప్రతిపక్షాల నేతలు తీవ్రంగా ఖండించారు. ట్రంప్ సుంకాల ప్రకటనలపై ఇప్పట ికైనా ప్రధాని మోడీ మౌనం వీడాలని డిమాండ్ చేశారు. ట్రంప్ టారిఫ్‌లపై ప్రధాని మోడీ సమాధానం ఇవ్వాలని ఎక్స్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఈ సుంకాలు భారత ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

**యుఎస్ చర్యలు అన్యాయం : భారత విదేశాంగ శాఖ**

అమెరికా చర్యలు అన్యాయమైనవని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ సుంకాలు అసమంజసమైనవని విమర్శించింది. దేశానికి అవసరమైన అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. "అమెరికా ఇటీవల రష్యా నుండి భారత చమురు దిగుమతులను లక్ష్యంగా చేసుకుంది. మా దిగుమతులు మార్కెట్ పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. 140 కోట్ల భారతీయుల ఇంధన భద్రతను దృష్టిలో పెట్టుకుని కొనుగోళ్లు జరుగుతాయి. అమెరికా భారత్‌పై అదనపు సుంకాలు విధించడం దురదృష్టకరం " అని విదేశంగ శాఖ పేర్కొంది.

**ఎగుమతులు 30 శాతం పతనమే..! : జిఆర్‌టిఐ**

అమెరికా టారిఫ్‌లు భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర భారం మోపనున్నాయని న్యూఢిల్లీలోని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (జిఆర్‌టిఐ)కి చెందిన అజరు శ్రీవాస్తవ పేర్కొన్నారు. అధిక టారిఫ్‌ల వల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26లో అమెరికాకు భారతీయ వస్తువుల ఎగుమతులు 30 శాతం పతనం కావొచ్చని అంచనా వేశారు. 86.5 బిలియన్ నుండి అమాంతం 60.6 బిలియన్ డాలర్లకు ఎగుమతులు పడిపోవచ్చని అంచనా వేశారు.

## సీఐఐ భాగస్వామ్య సదస్సును విజయవంతం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)



“ఆంధ్రా ఈజ్ బ్యాక్’ అనే విధంగా సీఐఐ భాగస్వామ్య సదస్సును నిర్వహించాలి. ప్రపంచ నలుమూలల నుంచి పెట్టుబడులు ఆకర్షించే విధంగా సదస్సును విజయ వంతం చేయాలి. తద్వారా ఏపీలో ఉపాధి, ఆర్థిక రంగ వృద్ధి జరుగుతుంది. ఒక్కో దేశానికి సంబంధించిన ఒక్కో థీమ్ ను సిద్ధం చేయాలి” అని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. పెట్టుబడుల ఆకర్షణ కోసం దేశ, విదేశాల్లో రోడ్ షోలు నిర్వహించి.. పారిశ్రామికవేత్తలకు ఏపీని కేంద్రంగా చేయాలని మంత్రివర్గ ఉపసంఘం ఆదేశించింది. సదస్సుకు విశాఖ ఏయూ గ్రౌండ్స్ ను మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు ఖరారు చేశారు. ‘టెక్నాలజీ, ట్రస్ట్, ట్రేడ్: నేవిగేటింగ్ ది న్యూ జియో- ఎకనమిక్ ఆర్డర్’ థీమ్ తో ఈ సదస్సును సీఐఐ భాగస్వామ్యంతో నిర్వహించనున్నారు. ప్రతి 15 రోజులకోసారి మంత్రివర్గ ఉపసంఘం సమావేశం నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమీక్షలో మంత్రులు టీజీ భరత్, పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేశ్, కొండపల్లి శ్రీనివాస్ తో పాటు సీఎస్ కె.విజయానంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకుందాం

**- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్**

**విశాఖపట్నం- సూర్య వాస్తవం,ఆగస్టు 6:** పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (పిడిఎస్) బియ్యం అక్రమ రవాణాను ప్రణాళిక బద్ధమైన చర్యలతో అడ్డుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. విశాఖపట్నం నోవాటెల్ హెూటల్‌లో విశాఖపట్నం పోర్టు, కస్టమ్స్ అధికారులతో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ విశాఖపట్నం పోర్టు, కస్టమ్స్ అధికారులు, సివిల్ సప్లై శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు అందించే సబ్సిడీ బియ్యం మళ్లింపునకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సరిహద్దులు, పోర్టులు, రవాణా మార్గాల వద్ద పటిష్ట తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై కమిషనర్, విశాఖపట్నం జాయింట్ కలెక్టర్, పోర్టు, కస్టమ్స్ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 31న చైనాకు ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, ఆగస్టు 6:** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ త్వరలో చైనాలో పర్య టించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైంది. తియాంజిన్ వేదికగా ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో జరగనున్న షాంఘై సహకార సదస్సులో మోడీ పాల్గొననున్నారు. ఈ పర్యటనలో రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లతో ప్రధాని ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతేడాది కజాన్‌లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో జిన్‌పింగ్‌తో మోడీ భేటీ అయిన విషయం తెలిసిందే. తొలిసారిగా 2015లో బీజింగ్‌కు వెళ్లిన ప్రధాని మోడీ ఇప్పటివరకు ఐదుసార్లు ఆ దేశంలో పర్యటించారు. 2019లో చివరిసారిగా చైనాలో పర్యటించారు. ఆ తర్వాత 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతిన్నాయి. వీటి పునరుద్ధరించేందుకు సైనిక, దౌత్యాధికారుల మధ్య అనేక దఫాల్లో చర్చలు జరగ్గా ఇటీవలే పురోగతి కనిపిస్తోంది.చైనాలో ఈ ఏడాది జూన్‌లో జరిగిన ‘షాంఘై సహకార సంస్థ’ సభ్యదేశాల రక్షణ మంత్రుల సదస్సులో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. పాక్ ప్రేరేపిత సీమాంతర ఉగ్రవాదం, పహల్గాం ముష్కర దాడులను ప్రస్తావించక పోవడంపై తీవ్రంగా పరిగణించిన భారత్.. ఉమ్మడి ప్రకటనపై సంతకం చేసేందుకు నిరాక రించింది. దీంతో ఎలాంటి ఉమ్మడి ప్రకటన లేకుండానే నాటి చర్చలు ముగిశాయి. అనంతరం జులైలో జరిగిన విదేశాంగ మంత్రుల సదస్సులో భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పాల్గొన్న సంగతి తెలిసిందే.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )